
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

గురువారం 30 అక్టోబరు 2025

మచిలీపట్నం మండలం హుస్సేనిపాలెం వద్ద నీట మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతు



ముంచేసిన మొంథా

తీరం దాటే సమయంలో అతలాకుతలం

జిల్లా అంతటా భారీ వర్షాలు, ఈదురుగాలులు

బందరు మండలం అరిసేపల్లిలో నేలవాలిన వరి



తీరం దాటే సమయంలో మొంథా తుఫాను బీభత్సం సృష్టించింది. జిల్లా మొత్తాన్ని భారీవర్షాలు ముంచేశాయి. ఈదురుగాలులకు పంటలు సర్వనాశనమయ్యాయి. చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రోడ్లపై స్తంభాలు పడిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సముద్రతీర ప్రాంతాల్లో పరిస్థితులు భయానకంగా మారాయి. చేతికొచ్చేదశలో ఉన్న వరి నేలవాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొస్తుందా, లేదా అని భయపడుతున్నారు. అటు విజయవాడనూ తుఫాను అల్లాడించింది. భారీ వర్షాలకు నగరంలోని రోడ్లన్నీ జలమయం కాగా, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది.

- నేలకొరిగిన పంట పొలాలు.. వరికి భారీనష్టం
- నీటిలో నానిపోయి మొలకెత్తుతున్న ధాన్యం
- ఉద్యాన పంటలకూ తీవ్రనష్టం
- నీటిలో తేలియాడుతూ కనిపించిన పొలాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు
- నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు
- మచిలీపట్నంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర పర్యటన
- విజయవాడలో భారీ వర్షాలు.. స్తంభించిన జనజీవనం
- పొంగుతున్న వాగులు, ఏరులు.. రాకపోకలు బంద్

మచిలీపట్నంలో ఉప్పు చెరువులకు గండ్లు



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మొంథా తుఫానుకు జిల్లా చిగురుటాకులా వణికింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో అంతటా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి. బలమైన గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం ఉదయం 8.30 గంటల వరకు నాగాయలంకలో అత్యధికంగా 80.4 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా గూడూరులో 9.0 మిల్లీమీటర్ల మిగతా 6లో..

భారీగా పంటనష్టం

ఈ ఏడాది జిల్లాలో 1.60 లక్షల హెక్టార్లలో వరిసాగు జరిగింది. 1.20 లక్షల హెక్టార్లలో వరిపంట కంకులు ఈని పాలుపోసుకునే దశలో ఉంది. మరికొంత పొలంలో నవంబరు మొదటివారంలో కోత కోసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. పెట్టుబడి మొత్తం పెట్టి కోతకు సిద్ధమైన తరుణంలో మొంథా తుఫాను తమను నిలువునా ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వరి, మినుము, వేరుశెనగ పంటలు 46వేల357 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

మేకవానిపాలెంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం ➤




మచిలీపట్నంలోని జిల్లాకోర్టు రోడ్డులో...



నేటి నుంచి పాఠశాలలు

తుఫాను కారణంగా జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు మూడు రోజులు సెలవులు ప్రకటించగా, గురువారం నుంచి యథావిధిగా పనిచేస్తాయని డీఈవో పీవీజే రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాను హెచ్చరికలను పాటించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా సహకరించిన జిల్లా ప్రజలకు కలెక్టర్ బాలాజీ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కోడూరుకు డిప్యూటీ సీఎం



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండలంలో గురువారం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించనున్నట్లు జనసేన నాయకులు బండ్రెడ్డి రామకృష్ణ, బండి రామకృష్ణ తెలిపారు. బుధవారం రాత్రి వారు మీడియాతో మాట్లాడారు. కోడూరు మండలంలోని పునరావాస కేంద్రాలతో పాటు సముద్రపు ఆటుపోట్లకు గురవుతూ నష్టపోతున్న పంట పొలాలను పరిశీలిస్తారని చెప్పారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో పాటు జనసేన, టీడీపీ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కొబ్బరిచెట్టు విరిగిపడి రైతు మృతి

కృత్తివెన్ను, అక్టోబరు 29 : తుఫాను ధాటికి కొబ్బరిచెట్టు విరిగి మీదపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. కృత్తివెన్ను గ్రామానికి చెందిన కోయి సుబ్బారావు (57) వాలంక గ్రామంలో బుధవారం పశువులపాక వద్దకు వెళ్లి పాలు తీసుకొని వస్తుండగా భయంకరమైన గాలులకు రహదారి పక్కనే ఉన్న కొబ్బరిచెట్టు విరిగిపడింది. ఈ ప్రమాదంలో సుబ్బారావు తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. తొలుత 108లో మచిలీపట్నం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి పంపినా ఫలితం లేకుండాపోయింది. సుబ్బారావు మృతిచెందాడు. మృతదేహానికి విజయవాడలో పోస్టుమార్టం నిర్వహించి, స్వగ్రామానికి తరలించారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

లెక్క తేల్చారు

అద్విక కేసులో తేలిన లాభనష్టాలు

25 మంది నిందితులు.. రూ. 144 కోట్ల నష్టం

- లెక్కలు తేలని మొత్తం రూ.39.50 కోట్లు
- బాధితులు 92 మందిగా నిర్ధారణ
- వారికి న్యాయం చేసే ప్రణాళికలు
- స్థిరచరాస్తులు జప్తు చేసే యోచన
- ప్రభుత్వ అనుమతి తీసుకున్నాకే..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అద్విక ప్రైవేట్ లిమిటెడ్ ముసుగులో తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య, ఆయన సతీమణి సుజాత చేసిన మోసంపై మాచవరం పోలీసులు క్రైం నంబరు 248/2025తో బీఎన్ఎస్ 318 (4), 316 (2), 316 (5) (2) 61తో పాటు ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలోని సెక్షన్ 5 కింద కేసు నమోదు చేశారు. ఈ మోసంలో మొత్తం 25 మందిని నిందితులుగా పేర్కొన్నారు. వారిలో ఆదిత్య, భార్య సుజాత, వారికి సహకరించిన ఏజెంట్లు గాదంశెట్టి బాలకృష్ణమూర్తి, ఆయన సతీమణి నాగలక్ష్మీదేవిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదిత్య ఏజెంట్లు, ఖతాదారుల నుంచి పెట్టుబడులను స్వీకరించినా ఎక్కడా రికార్డులు నిర్వహించలేదు. బ్యాంకింగ్‌లో సుజాతకు ఉన్న అనుభవం, మోసాల్లో తనకున్న మిగతా 6లో..



ప్రభుత్వ అనుమతితో జప్తు

అద్వికలో పెట్టుబడుల ద్వారా సేకరించిన డబ్బుతో ఆదిత్య సమకూర్చుకున్న చరస్థిరాస్తులను పోలీసులు సీజ్ చేశారు. వాటి విలువ రూ.100 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. త్వరలో ప్రభుత్వ అనుమతి తీసుకుని ఈ మొత్తం ఆస్తులను జప్తు చేస్తామని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు వెల్లడించారు. అనుమతిగా రాగానే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు. వాటితో పాటు వివిధ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదు, ఏజెంట్లు తిరిగి చెల్లించే లాభాలను బాధితులకు పంచుతామని స్పష్టం చేశారు.

ఏజెంట్లు 32 మంది. పెట్టుబడి రూ.54 కోట్లు. తీసుకున్న మొత్తం రూ.105 కోట్లు. పొందిన లాభం రూ.49 కోట్లు. అధిక వడ్డీలు చెల్లిస్తానని ప్రజల నుంచి డబ్బు సేకరించిన అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఏజెంట్లు తీసుకున్న లాభాలివి. అద్విక కేసు దర్యాప్తును ముగించిన సిట్ మొత్తం లెక్కలను సవివరంగా తెలియజేసింది. బాధితులు, ఆస్తుల వివరాలతో పాటు నష్టాన్ని కూడా లెక్కించింది.

వాగులు, వంకలకు వరద

తెలంగాణాలో వర్షాలు.. భారీగా చేరుతున్న నీరు

పెనుగంచిప్రోలు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు



- మునేరు ఉధృతం.. 45 వేల క్యూసెక్కులకు వరద
- ఒక్కరోజులో 8 రెట్లు పెరిగిన ప్రవాహం
- లక్ష క్యూసెక్కులు దాటుతుందన్న నిపుణులు
- చిల్లకల్లు-వైరా మార్గంలో లింగాల కాజ్‌వే మూసివేత
- ప్రమాదకరంగా కట్టలేరు, వైరాయేరు
- పల్లెంపల్లి గ్రామం వద్ద కాజ్‌వే క్లోజ్
- పాలేరుకు 4 లక్షల క్యూసెక్కుల నీరు రాక
- జగ్గయ్యపేట-బలుసుపాడులో రాకపోకలు బంద్
- ఏపీ-తెలంగాణా మధ్య నిలిచిన రాకపోకలు

తెలంగాణా నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో ఎన్టీఆర్ జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మునేరు మహోధృతం కాగా, వైరాయేరు, కట్టలేరు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. రోడ్లపైకి వరద చేరుతుండటంతో తెలంగాణా నుంచి రాకపోకలు దాదాపు బంద్ అయ్యాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల/జగ్గయ్యపేట రూరల్) : మునేరు మహోధృతమై ప్రవహిస్తోంది. బుధవారం రాత్రి 8 గంటలకు రికార్డు స్థాయిలో 45 వేల క్యూసెక్కుల వరద మునేరుకు చేరింది. సాయంత్రం 5.30 గంటలకు వరద 28 వేల క్యూసెక్కులు ఉండగా, రాత్రి 8 గంటలకు 45 వేల క్యూసెక్కులకు చేరింది. చిల్లకల్లు నుంచి వైరా వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో వత్సవాయి మండలం లింగాల వద్ద కాజ్‌వేపైకి వరద చేరింది. దీంతో ఏపీ, తెలంగాణా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అయితే, కృష్ణానదిలో ప్రమాదకర స్థాయిలో నీరు లేనందున వరద లక్ష క్యూసెక్కుల వరకు వచ్చినా ఇబ్బంది లేదు. ఆపైన దాటితే మాత్రం కంచికచర్ల, వత్సవాయి, చందర్లపాడు, పెనుగంచిప్రోలు, మిగతా 6లో..

పాలేరుకు 4 లక్షల క్యూసెక్కుల వరద

జగ్గయ్యపేట రూరల్ మండలంలోని పాలేరుకు భారీ వరద చేరింది. మొత్తం 4 లక్షల కూసెక్కుల వరద ప్రవహిస్తోంది. ఖమ్మం జిల్లా కూసుమంచి దగ్గర పాలేరు రిజర్వాయర్ ఉంది. ఇది ఫుల్ అవడంతో దిగువకు విడుదల చేశారు. జగ్గయ్యపేటలో ఇది రావిరాల గ్రామం దగ్గర కృష్ణానదిలో కలుస్తుంది. భారీస్థాయిలో వరద వస్తున్నా ఇబ్బందికర పరిస్థితులు అయితే లేవు. పులిచింతల నుంచి వరద వస్తే తప్ప ఇబ్బంది లేదు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే రావిరాల, బూదవాడ, అన్నవరం గ్రామాలపై ప్రభావం ఉంటుంది. పాలేరు వరదను దృష్టిలో ఉంచుకుని జగ్గయ్యపేట-బలుసుపాడు రోడ్డులో రాకపోకలను నిలిపివేశారు. ప్రమాద హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేసి బారికేడ్లు పెట్టారు.



దుర్గగుడికి మొంథా తుఫాను ఎఫెక్ట్

- వెలవెలబోయిన ఆలయ పరిసరాలు

6

ముందుజాగ్రత్తతోనే పవర్ కట్

- మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర

8

అన్నదాతపై మొంథా పిడుగు!



- నీటిలో నానుతున్న పత్తిచేలు
- నేలవాలిన వరి, మిర్చి, కంది పంటలు
- రైతులకు తీరని ఆవేదన
- జలమయమైన పల్లపు ప్రాంతాలు
- కాకర్ల వాగుపై వంతెనకు నెర్రలు
- పలు చోట్ల కూలిన భారీ వృక్షాలు



వీరులపాడులో ఒరిగిన కంది చెట్లు

మొంథా తుఫాను దెబ్బకు జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి పంట, మిర్చి తోటలు నీటిలో నానుతున్నాయి. గింజ పోసుకుంటున్న పంటలు చేతి కందే తరుణంలో తుఫాను వల్ల నిలువునా పంటలు దెబ్బతినటంతో రైతుల వెన్ను విరిగింది. కకావికలమైన పంటలను చూసి అన్నదాత కన్నీటి పర్యంతమయ్యాడు. మూడు రోజులుగా ఎడతెగని వర్షాలు.. బలమైన ఈదురుగాలులకు చేలన్నీ పడిపోయాయి.

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల/ఇబ్రహీంపట్నం)

● ఈ ఏడాది జిల్లాలో 81,875 ఎకరాల్లో పత్తి సాగైంది. తుఫాను గాలులకు చెట్లు నెలకొరిగాయి. పడిన చెట్లను కదిలించే పరిస్థితి లేదు. చేలల్లో తీయాల్సిన పత్తి తడిసి పోయి నేలపై పడి రంగు (నాణ్యత) కోల్పోతుంది. ఇప్పటికే ఫంగస్ వ్యాప్తితో గుడ్డి, కాయ పత్తితో సతమతమవుతున్న రైతులను మొంథా నిలువునా ముంచింది. పత్తి రైతులు కోలుకునే పరిస్థితి కనిపించటం లేదు. పెట్టుబడులు రావటం చాలా కష్టం.



● మిర్చి తోటలు నీటిలో నానుతున్నాయి. పూత, పిందె, కాయ దశలో ఉన్న తోటలు బాగా దెబ్బతిని గాలులకు నేలకొరిగాయి. ఒకటి, రెండు రోజుల్లో నీరు పూర్తిగా బయటకు వెళితే చెట్లు బతుకుతాయి. లేకుంటే వేళ్ల కుళ్లి పోయి చెట్లు నిలువునా ఎండిపోతాయి. ఇప్పటికే ఎకరానికి రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు దెబ్బతింటున్న మిర్చి తోటలను చూసి భోరున విలపిస్తున్నారు.

● తుఫాను దెబ్బకు మొక్కజొన్న పంట పనికిరాకుండా పోయింది. రోజుల తరబడి తడవటంతో గింజల నుంచి మొలకలు వస్తున్నాయి. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి నాశనమైంది. పెట్టుబడి దక్కకపోగా, తీవ్రంగా నష్టపోవాల్సి రావటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మొక్కజొన్న ఇక పనికిరాదని రైతులు చెపుతున్నారు. నందిగామ డివిజన్‌లోనే పదివేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న వేశారు. పక్షం రోజుల క్రితం కొద్ది విస్తీర్ణంలో పంట యంత్రాలతో కోయించారు. వర్షం పడుతుండటంతో మిగతా పంట కోయలేదు.

● వీరులపాడు మండలంలో కంది పంట రెండువేల ఎకరాల్లో సాగుచేశారు. ఈదురు గాలులకు చెట్లు ఒరిగిపోయాయి. కందికి కనపడని నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు.

● జిల్లాలో ఎత్తిపోతల పథకాలు, చెరువులు, వాగులు, కాల్వల కింద సాగుచేసిన సుమారు 1.20 లక్షల ఎకరాల్లో మాగాణి వరి వివిధ దశల్లో ఉంది. కొన్ని ప్రాంతాల్లో వరి కొద్ది రోజుల్లో కోతకు రానుండగా, కొన్ని ప్రాంతాల్లో మాత్రం పొట్ట దశలో ఉంది. బలమైన ఈదురు గాలులకు వరి వెన్ను విరగటంతో పూర్తిగా నేలపై పడిపోయింది. కోతకు వచ్చిన వరి పంట చేతికి అందటం కష్టం. నీటిలో నానుతుండటం వల్ల పంట పూర్తిగా దెబ్బతింటుంది. పొట్ట దశలో ఉన్న వరిపైరు కింద పడటం వల్ల ఆశించిన దిగుబడి రాదని రైతులు వాపోతున్నారు. కళ్ల ముందే పంట దెబ్బతినటంతో రైతులు అల్లాడిపోతున్నారు.



వత్సవాయి మండలం మంగొల్లులో పడిపోయిన వరి

మొంథా తుపాను ప్రభావంతో తిరువూరు నియోజకవర్గ పరిధిలోని తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో, మైలవరం నియోజకవర్గ పరిధిలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో, విజయవాడ రూరల్ మండలం రాయనపాడు, పైడూరుపాడు, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి తదితర ప్రాంతాల్లో వరి నేలవాలింది. కొన్ని మండలాల్లో పంట కోత దశలో ఉండగా.. కొన్నిచోట్ల పాలు పోసుకునే దశలో ఉంది. మంగళవారం రాత్రి భారీ ఈదురు గాలులకు పంట నేలవాలిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి రెండ్రోజులు వర్షాలు పడితే పంటలకు మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులంటున్నారు. ఎ.కొండూరు మండలం వల్లంపట్ల, పోలిశెట్టిపాడు, కోడూరు గ్రామాల్లో 440 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న పులివాగు

● మైలవరం మండలం పోరాటనగర్ స్కూల్ సమీపంలో కాకర్ల వాగుపై వంతెన శిథిలావస్థకు చేరి నెర్రెలివ్వడంతో భారీ వాహనాలను నిలిపివేశారు. కోడూరు-కంభంపాడు గ్రామాల మధ్య ఊట వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు. రామచంద్రాపురం బీసీ కాలనీలో పల్లపు ప్రాంతంలో ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.



రెడ్డిగూడెం-ఓబులాపురం గ్రామాల మధ్య రహదారిపై పొంగి పొర్లుతున్న వాగు

● రెడ్డిగూడెం మండలంలో నాగసానిపాటి చెరువుకు వెళ్లే వాగు ఉధృతికి రెడ్డిగూడెం-ఓబులాపురం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ, పోలీస్ గస్తీ ఏర్పాటు చేశారు.

● జి.కొండూరు మండలం కవులూరులో పశువుల ఆసుపత్రి వద్ద 130 ఏళ్ల నాటి రావి చెట్టు కుప్పకూలింది. చెట్టు కింద ఉంచిన ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. వెంకటాపురం ఎర్ర చెరువుకు గండి పడింది. జి.కొండూరులోని పులివాగుకు వరద వచ్చింది.

కంచికచర్ల మండలంలో నీటిలో నానుతున్న పత్తి చేను

● ఇబ్రహీంపట్నం మండలంలో వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. ఏనుగుగడ్డ వాగుకు వరద పోటెత్తింది. కొండపల్లి మున్సిపాలిటీలో డ్రెయిన్లు పొంగి నీరు రోడ్లపై ప్రవహించింది. కొండపల్లి గాయత్రి వేవి గుడి వద్ద ఇళ్ల మధ్యలోకి వచ్చిన భారీ కొండ చిలువను ప్రజలు హతమార్చారు.



వెంకటాపురంలో ఎర్రచెరువుకు గండి

నష్టం అంచనాకు డ్రోన్లు

విజయవాడ సిటీ/కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నష్టం అంచనాలకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జిల్లా యంత్రాంగం వినియోగిస్తోంది. నష్టం వివరాలను సేకరించేందుకు తొలిసారిగా డ్రోన్‌లను రంగంలోకి దించుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు డ్రోన్‌లను పంపుతున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. డ్రోన్ కార్పొరేషన్ ద్వారా అందుబాటులోకి వచ్చిన డ్రోన్ల పనితీరును కలెక్టరేట్‌లో ఆయన బుధవారం పరిశీలించారు. సత్వరమే పారదర్శకంగా నష్టం అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు సాంకేతిక చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొంథా తుఫాను బీభత్సానికి పంటలు, రోడ్లు, భవనాలు, వంతెనలు, నివాస ప్రాంతాలు దెబ్బతిన్నాయి. బలమైన గాలులకు ఆస్తి నష్టం జరిగింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి ఈదురు గాలులు తోడవడంతో ఊహించని నష్టం వాటిల్లింది. బాధితుల వివరాలు, నష్టం అంచనాల లెక్కను పక్కాగా వెల్లడించేందుకు డ్రోన్‌లను క్షేత్రస్థాయిలోకి పంపిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. నష్టాన్ని వేగవంతంగా, కచ్చితంగా, అత్యంత పారదర్శకంగా అంచనా వేసేందుకు డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 20 మండలాల్లో నష్టాల అంచనాలకు మండలానికి ఒక డ్రోన్ టీమ్ పనిచేస్తుందని వివరించారు. డిజిటల్ మ్యాపులు, ఫొటోలు, 3డీ నమూనాల రూపంలోనూ పంట నష్టం నివేదికలను డ్రోన్‌లు అందిస్తాయన్నారు. డ్రోన్ సాంకేతికత ద్వారా సేకరించిన డేటా ఆధారంగా పునరుద్ధరణ, పునర్నిర్మాణ పనులు సత్వరం చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు.





హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభేందు సమంతో దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మసేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను బుధవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నూతన న్యాయమూర్తి జస్టిస్ సుభేందు సమంతో సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వేద పండితులు అమ్మవారి ఆశీస్సులు, చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



భక్తులు లేక వెలవెలబోయిన క్యూలు

దుర్గగుడికి మొంథా తుఫాన్ ఎఫెక్ట్

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రికి మొంథా ఎఫెక్ట్ తగిలింది. తుఫాను కారణంగా మంగళ, బుధవారాల్లో జోరువానలు కురిశాయి. జాతీయరహదారులపై మంగళవారం సాయంత్రం నుంచి అధికారులు ఆంక్షలు విధించారు. భారీవానలు కురుస్తున్న నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దన్న అధికారుల సూచనల మేరకు ప్రయాణికులు ఎక్కడికక్కడ ఆగిపోయారు. భక్తులు లేక ఆలయం బోసిపోయింది. కనకదుర్గానగర్, మహామండపం దిగువన, అన్ని క్యూలు, ఆలయ ప్రాంగణం నిర్మానుష్యంగా కనిపించింది.

నవంబరు 7న పాలకమండలి సమావేశం

దుర్గామల్లేశ్వర దేవస్థానం పాలకమండలి మొదటి సమావేశం నవంబరు 7న వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి ప్రాంగణంలో జరగనున్నట్టు దేవస్థానం పాలకమండలి చైర్మన్ బి.రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 7వ తేదీ ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించనున్నట్టు వారు తెలిపారు.

ముందస్తు చర్యలతో ముప్పు తప్పింది

- కలెక్టర్ లక్ష్మీశ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు
- తుఫాను సహాయక చర్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫానును ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు యంత్రాంగాన్ని అద్భుతంగా సమాయత్తం చేశారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సత్యకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి తుఫాను సహాయక చర్యలను కలెక్టర్ లక్ష్మీశతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి యంత్రాంగానికి దిశానిర్దేశం చేసి, అన్ని విధాలుగా సంసిద్ధుల్ని చేశారని, తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని, ఆస్తి ప్రాణ నష్టాలను నివారించగలిగామని చెప్పారు. కలెక్టర్ లక్ష్మీశ అన్ని జాగ్రత్తలు తీసుకొన్నారని, లోతట్టు, తుఫాను ముప్పు వున్న ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారని చెప్పారు. బుడమేరు, ప్రకాశం బ్యారేజీలలో ఇన్‌ఫ్లో తక్కువగానే వుందని చెప్పారు.



కలెక్టర్ లక్ష్మీశతో కలిసి నగరంలో పర్యటిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌ఓ ఎం.లక్ష్మీ నరసింహం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారులపై నీళ్లు నిలవకుండా పకడ్బందీ చర్యలు

విజయవాడలో బ్రిడ్జి ప్రాంతంలోని వాననీటి పంప్‌హౌస్‌ను, ఎనిమిది మోటార్ల పనితీరును మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు మోటార్లతో తోడేసినట్టు వెల్లడించారు. ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందిలేకుండా కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిసనర్ ధ్యానచంద్ర మార్గదర్శనంలోని ప్రత్యేక బృందాలు కీలకపాత్ర పోషించాయన్నారు. నీరు నిలిచిపోతే అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలే అవకాశముందని, అందువల్ల ఎక్కడా వర్షపునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.



రహదారిపై నీటిని తోడేస్తున్న సిబ్బంది

ముంచేసిన మొంథా

(5వ పేజీ తరువాయి)

వర్షపాతం నమోదు కాగా, సగటు 35.0 మిల్లీమీటర్లుగా ఉంది. కోడూరులో 65.8, పెనమలూరులో 58.6, కంకిపాడులో 55.4, తోట్లవల్లూరులో 44.6, మోపిదేవిలో 40.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో 40 మిల్లీమీటర్ల కంటే తక్కువ నమోదైంది. వర్షంతో పాటు బలమైన గాలులు వీచాయి. ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలు, చెట్లు ఒరిగిపోవడంతో యుద్ధప్రాతిపదికన తొలగించారు. అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన, కృత్తివెన్ను తదితర మండలాల్లో బుధవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్ మచిలీపట్నంలో పర్యటించి పరిస్థితిని పర్యవేక్షించారు. కోడూరు-అవనిగడ్డ రహదారి వెంబడి చెట్లు పడిపోగా, రాకపోకలు నిలిచిపోయాయి. కోడూరు మండలం స్వతంత్రపురంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని కలెక్టర్, జేసీ నవీన్ పరిశీలించారు. జిల్లాలో 224 పునరావాస శిబిరాలను ఏర్పాటుచేసి అందులో 17,272 మందికి ఆవాసం కల్పించినట్లు కలెక్టర్ బాలాజీ తెలిపారు. తుపాను తీవ్రత తగ్గడంతో ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసి ప్రజలను ఇళ్లకు పంపిస్తున్నారు.

ఉద్యాన పంటలపై ప్రభావం

జిల్లాలోని తోట్లవల్లూరు, మోపిదేవి, చల్లపల్లి, పమిడిముక్కల, పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, బాపులపాడు తదితర మండలాల్లోని కూరగాయలు, తమలపాకు, అరటితోటలు నేలకొరిగాయి. తోటల్లోకి వర్షపునీరు చేరి నిలబడటంతో మొక్కలు చనిపోతాయని రైతులు చెబుతున్నారు. నీరు తగ్గినకొద్దీ మొక్కలకు ఉన్న ఆకులు రాలిపోతాయని రైతులు అంటున్నారు. ఉద్యానశాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం.. అవనిగడ్డ మండలంలో 126 మంది రైతులకు చెందిన 129 హెక్టార్లలో, చల్లపల్లిలో 116 ఎకరాల్లో, ఘంటసాల మండలంలో 21 మంది రైతులకు చెందిన 10.08 హెక్టార్లలో, మొవ్వ మండలంలో 23 మంది రైతులకు చెందిన 10.23 హెక్టార్లలో, తోట్లవల్లూరులో 707 మంది రైతులకు చెందిన 558.89 హెక్టార్లలో, మోపిదేవి మండలంలో 764 మంది రైతులకు చెందిన 395.84 హెక్టార్లలో, పమిడిముక్కల మండలంలో 30 మందికి చెందిన 13 హెక్టార్లలో, పామర్రు మండలంలో 28 మందికి చెందిన 13.38 హెక్టార్లలో, పెడన మండలంలో 8 మందికి చెందిన 2.30 హెక్టార్లలో, గూడూరులో ఆరుగురు రైతులకు చెందిన 1.43 హెక్టార్లలో, మచిలీపట్నం మండలంలో 46 మంది రైతులకు చెందిన 22.67 హెక్టార్లలో, ఉయ్యూరు మండలంలో 70 మందికి చెందిన 33.40 హెక్టార్లలో, పెనమలూరు మండలంలో 102 మంది రైతులకు చెందిన 50 హెక్టార్లలో, కంకిపాడులో 44 మంది రైతులకు చెందిన 26 ఎకరాల్లో, బాపులపాడు మండలంలో 64 మంది రైతులకు చెందిన 24 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు నిర్ధారించారు. మొత్తంగా 2,229 మంది రైతులకు చెందిన 1,416.22 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినగా, రూ.73.45 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లుగా అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పూర్తిస్థాయిలో సర్వే చేశాక పంటనష్టం పెరగడం లేదా, తగ్గడం జరుగుతుందని పేర్కొన్నారు.

లెక్క తేల్చారు

(5వ పేజీ తరువాయి)

తెలివితో పెట్టుబడులు ఎలా రాబట్టాలో ఆలోచించారు. 92 మంది రూ.9.47 కోట్లను పెట్టుబడిగా పెట్టారు. వారంతా కంపెనీ, ఏజెంట్ల నుంచి ఒక్క రూపాయి రిటర్న్ తీసుకోలేదు. వారందరినీ బాధితులుగా పోలీసులు నిర్ధారించారు.

మొత్తం రూ.144 కోట్ల నష్టం

2022లో అద్విక సంస్థను ఏర్పాటుచేసిన ఆదిత్య ఇప్పటి వరకు 1,417 మంది నుంచి రూ.413.03 కోట్లు సేకరించాడు. వాటిలో రూ.355.03 కోట్లు తిరిగి చెల్లించి, రూ.144 కోట్లకు ఎగనామం పెట్టాడు అని పోలీసులు నిర్ధారించారు. ఇందులో పెట్టుబడులు పెట్టిన వారందరినీ విజయవాడలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పిలిపించి విడివిడిగా వాంగ్మూలాలు తీసుకున్నారు. చెల్లింపులకు సంబంధించిన లావాదేవీలను టాలీ షీట్ ద్వారా సరిచూశారు. ఇలా రేయింబవళ్లు లెక్కలు తీస్తే అద్విక చూపించిన నష్టం రూ.144 కోట్లుగా తేలింది. డిపాజిటర్లలో 1,139 మంది రూ.255 కోట్లు అద్వికలో పెడితే రూ.120 కోట్లను మాత్రమే తిరిగి తీసుకున్నారు. వారికి ఆదిత్య రూ.135 కోట్ల నష్టాన్ని మిగిల్చాడు. ఏజెంట్లలో 30 మంది రూ.54 కోట్లు పెడితే రూ.45 కోట్లు మాత్రమే చెల్లించాడు. వారికి రూ.9 కోట్ల నష్టాన్ని చూపించాడు.

'దర్యాప్తు'నకు రివార్డులు

సుమారు ఐదు నెలలుగా కేసును అధ్యయనం చేసిన పోలీసు అధికారుల అసలు గుట్టును బయటకు లాగారు. పెట్టుబడులు, చెల్లింపులు పోగా పైసా ముట్టని బాధితులకు న్యాయం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అద్వికలో పెట్టుబడులు పెట్టి లాభాలు పొందినవారంతా వాటిని వెనక్కి ఇవ్వాలని ప్రతిపాదించారు. లేనిపక్షంలో సంస్థ ఎండీ శ్రీవెంకట ఆదిత్య దంపతుల మాదిరిగా కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. కాగా, దర్యాప్తు అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అభినందించారు. వారికి నగదు బహుమతులు అందజేశారు. ఈ కేసు దర్యాప్తునకు ఏర్పాటు చేసిన సిట్‌కు క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి చీఫ్‌గా వ్యవహరించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమారి, సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదరరావు, మాచవరం ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, మాచవరం ఎస్ఐ శంకర్, పటమట ఎస్ఐ రేవతితో పాటు ఈ బృందంలో పనిచేసిన హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు నగదు బహుమతి అందజేశారు.



ఉధృతంగా వైరా, కట్లేరు నదులు

నందిగామరూరల్ : వైరా, కట్లేరు నదులు పొంగిపొర్లడంతో నందిగామ,వీరులపాడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని దాములూరు నుంచి వీరులపాడు మండలం పల్లపల్లికి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నదిలోకి ఎవరూ దిగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

మరోసారి మద్యం నిందితుల బెయిల్ పిటిషన్లు

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, నవీన్‌కృష్ణ, బాలాజీ కుమార్ యాదవ్ ఏసీబీ కోర్టులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. శ్రీధర్ రెడ్డి మంగళవారం దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన తిరిగి బుధవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం జైళ్లలో ఉన్న ఏడుగురు నిందితుల బెయిల్ పిటిషన్లను ఇటీవల కోర్టు కొట్టేసింది. వారిలో నలుగురు మరోసారి బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.

నకిలీ మద్యం పీటీ వారెంట్‌పై నేడు తీర్పు

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో చిత్తూరు జిల్లా జైల్లో ఉన్న నలుగురు నిందితుల పీటీ వారెంట్‌పై తీర్పును విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సయ్యద్ హాజి, కట్టా శ్రీను, మిథున్ దాస్, అంతదాస్ నిందితులుగా ఉన్నారు. వారిపై పీటీ వారెంట్‌కు అనుమతి ఇవ్వాలని కొద్దిరోజుల క్రితం ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. 22వ తేదీలోపు వారిని కోర్టులో హాజరుపరచాలని న్యాయాధికారి జి.లెనిన్‌బాబు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఎక్సైజ్ పోలీసులు వారిని హాజరుపర్చలేదు. దీనితో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల గడువు ముగిసిపోయింది. ఇప్పుడు మళ్లీ ఎక్సైజ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

వాగులు, వంకలకు వరద

(5వ పేజీ తరువాయి)

నందిగామ మండలాల పరిధిలో పంటలు తీవ్రంగా దెబ్బతినటమే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 గ్రామాల ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. వరద అంతకంతకూ పెరుగుతుండటంతో మునేటి పరిధిలోని వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాల్సిందిగా ఆర్‌డీవో కె.బాలకృష్ణ. రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వరద ఉధృతంగా వస్తున్నందున తీర గ్రామాల్లో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా వైరా, కట్లేరు

వైరాయేరు, కట్లేరు ప్రమాదస్థాయి దాటి ప్రహిస్తున్నాయి. నందిగామమండలం దాములూరు కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి మధ్య కాజ్‌వేపై నాలుగైదు అడుగుల ఎత్తున వైరాయేరు ప్రవహిస్తోంది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వైరాయేరు వరద కూడా ఇంకా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. నందిగామ దగ్గర నల్లవాగు, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో యేనుగుగడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లవాగు ఉధృతి వల్ల నందిగామ నుంచి చందాపురం మీదుగా చందర్లపాడు వెళ్లేందుకు వీల్లేని పరిస్థితి ఏర్పడింది. యేనుగుగడ్డ వాగు ఉధృతికి రెండు మండలాల్లోని గ్రామాల్లో వేలాది ఎకరాల పంటలు నీటమునిగాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

అందుబాటులో వైద్యసేవలు

కంకిపాడు,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథాతు ఫాన్‌కు ప్రజలు ఇబ్బందులు పడకుండా అత్యవసర వైద్య సేవలందించేందుకు వైద్యశాఖ అప్రమత్తంగా ఉందని సామా జిక ఆరోగ్య కేంద్రం ఛైర్మన్ బోయిన రోహిణి కుమారి అన్నారు. మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆమె పర్య టించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు పీఏసీఎస్ ఛైర్మన్ సుంకర శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు పునరావాస కేంద్రంలో వైద్యశిబిరం

ప్రముఖ పారిశ్రామిక వేత్త

సురేంద్రబాబు మృతి



సురేంద్రబాబు(ఫైల్)

గన్నవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గన్నవరం ప్రముఖ పారిశ్రామికవేత్త ముక్కామల సురేంద్రబాబు (69) అనారోగ్యంతో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో మణి పాల్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఆయన బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. సురేంద్రబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ తదితర ప్రముఖులు సురేంద్రబాబు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నూజివీడు రోడ్డు జలమయం

విజయవాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి నూజివీడు ప్రధాన రహదారి జలమయమైంది. నున్న సమీపంలోని ఎన్టీపీసీ, మ్యాంగో మార్కెట్ పరిసర ప్రాంతాల్లో రహదారిపై మూడు అడుగుల మేర వర్షపు నీరు నిలచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కానూరులో రోడ్లు ..

కానూరు: మొంథా తుఫాను ప్రభావం వల్ల ఎడతెరపిలేకుండా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షాల వల్ల కానూరులోని పలు రోడ్లు జలయమమయ్యాయి. కానూరు మహదేవపురం కాలనీ సమీపంలోని యడ్లపల్లి సత్యం గారి వీధితోపాటు కానూరు పలు కాలనీలోని అంతర్గత రోడ్లు నీటితో నిండాయి. మెయిన్ రోడ్డులోని గొయ్యిల్లోకి వర్షపునీరు చేరడంతో చిద్రంగా తయారయ్యాయి.

వరి రైతులను ఆదుకోవాలి

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా సంభవించిన ఈదురు గాలులకు వరి పంట నేలకొరిగి రైతులకు తీవ్రనష్టాన్ని కలిగించిందని ఆ రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని సీపీఎం బాపులపాడు మండల కార్యదర్శి బేత శ్రీనివాస రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సీపీఎం బాపులపాడు మండల కమిటీ నాయకులు బుధవారం సందర్శించారు. సీపీఎం నాయకులు అబ్దుల్ బారి, రాజనాల సురేష్ ఉన్నారు.

తుఫాను బాధితులకు బాసటగా టీడీపీ నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : తుఫాను బాధితులకు టీడీపీ నేతలు బాసటగా నిలచారు. వీరవల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలోని బాధితులకు బుధవారం స్థానిక టీడీపీ నాయకుడు కలపాల రాజాబాబు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు నాయకుడు గుండపనేని ఉమావరప్రసాద్, గ్రామ సర్పంచ్ పిల్లా అనిత, లంక అజయ్ కుమార్, అమృతపల్లి సూర్యనారాయణ, కలపాల నాని, మండాది రవీంద్ర పాల్గొన్నారు.

● ఉమామహేశ్వరపురంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరంలో ఏఎంసీ డైరెక్టర్ అర్నేపల్లి రామలక్ష్మి, టీఎన్‌టీయుసీ నాయకుడు పాండురంగారావు, టీడీపీ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఆర్నేపల్లి సూరిబాబు, గండి శ్రీను, తదితరులు పాల్గొని బాధితులకు ఆహార సదుపాయాలను ఏర్పాటు చేశారు.

తాగునీరు సరఫరా

కంకిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫా న్ కారణంగా పలు ప్రాంతాల్లో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వివిధ శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. కంకిపాడు బచ్చుపేటలో తాగునీటి సమస్య తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం అందుకున్న కంకిపాడు పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర వరప్రసాద్ తక్షణం స్పందించారు. వాటర్ ట్యాంకర్‌తో ఆ ప్రాంత ప్రజలకు తాగు నీటిని అందించారు.

సహాయ చర్యలు ముమ్మరం

గన్నవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మొంథా తుఫాన్ కారణంగా కలిగిన ఇబ్బందులను తొలగించే పనులలో సర్పంచులు, కార్యదర్శులు బుధవారం నిమగ్నమయ్యారు. సూరంపల్లి, రామచంద్రపురం గ్రామాల మధ్య లో తుఫానుకు చెట్టు రోడ్డు మధ్యలోకి పడిపోవడంతో సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాస్ చెట్టును నరికి ప్రక్కకు తొలగించారు. కార్యదర్శి లక్ష్మణరావు పాల్గొన్నారు. కేసరపల్లి శివారు చెంచుల కాలనీలో నీళ్ల నిల్వ ఉండడంతో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ నీళ్ల కిందకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. రామ్‌నగర్, ఎస్సీ కాలనీలో నేలవాలిన చెట్లను కార్యదర్శి చెన్నకేశవరావు దగ్గరుండి తొలగించారు.

ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేసి

ప్రజలకు భరోసా కల్పించాం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేసి ప్రజలకు భరోసా కల్పించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చేయగలిగామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండల పరిధి కలవపాముల, కాటూరు, కడవకొల్లులో బుధవారం అధికారులు, కూటమి నాయకులతో కలసి పర్యటించి నేలవాలిన వరిపంటలు పరిశీలించి పంట నష్టంపై రైతులు, అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తుపాను ప్రభావంతో విరిగిన చెట్లు తొలగించి విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించామన్నారు. మండల పరిధిలో ఆయుకట్టు, ఏయే పంటలు ఎంత మేర నష్టం వాటిల్లి ఉంటుందన్నది 24 గంటల్లో లెక్కలు వేసి అందజేయాలని అధికారులకు సూచించారు. కలవపాముల పీఏసీ ఎస్ అధ్యక్షుడు కలపాల మల్లేశ్వరరావు, కాటూరు ఛైర్మన్ చంద్రశేఖర్ ఏఎంసీ ఛైర్మన్ ప్రవీణ్, సీనియర్ టీడీపీ నాయకుడు వేమూరు శ్రీనివాసరావు, ప్రభాకరరావు, తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు.



కలవపాములలో నేలవాలిన వరి పంట పరిశీస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పంట నష్టం అంచనా వేయాలి

కంకిపాడు: మొంథా తుఫాన్ కారణంగా జరిగిన పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరారు. మండలంలోని ఉప్పలూరు, మంతెన, తెన్నేరు, కుందేరు గ్రామాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల్లోని బుడమేరు వంతెనను పరిశీలిం చారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందస్తు చర్యలతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం లేకుండా చూడగలిగామన్నారు. స్థానికంగా ఎప్ప టికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహించామ న్నారు. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలను పరిశీలించామని తెలియజేశారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి పంట నష్ట వివరాలను సేకరించాలని కోరారు. అదే విధంగా ఉప్పలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భార్య పట్టించుకోవడం లేదని ఆత్మహత్య

పెనమలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భార్య తనను పట్టించుకోవడం లేదని మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కానూరు గ్రామానికి చెందిన బొట్టు రాజేష్(38)తన మొదటి భార్యతో విభేదాలతో విడాకులు తీసుకొని మరో యువతిని వివాహం చేసుకున్నాడు. ఆటో నగర్లో టింకరింగ్ పనులు చేసే ఇతనికి ముగ్గురు సంతానం. ఇతని రెండవ భార్య పనుల నిమిత్తం మస్కట్ వెళ్లిపోవడంతో తనను పట్టించుకోవడం లేదని మనస్థాపానికి గురై బుధవారం తన ఇంట్లో చున్నీతో ఉరివేసుకొని మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మహిళామండలి కట్ట వద్ద పేకాడుతున్న నలుగురు వ్యక్తులను పెనమలూరు ఎస్సై ఫిరోజ్ తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొన్నారు. బుధవారం జరిగిన ఈఘటనలో పేకాటరాయుళ్ల నుంచి రూ. 10,150 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పెనమలూరు స్టేషను పరిధిలో పేకాట, కోడిపందేల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకొంటామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు.

అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

కానూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం-2025 (ఎల్ఆర్ఎస్) ద్వారా అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ గడువు 2026 జనవరి 23వ తేదీ వరకు పొడిగించినట్లు తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి రిజిస్ట్రర్ అయిన అనధికార లేఅవుట్‌లు, ప్లాట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని, మున్సిపల్ పరిధి కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లో పరిధిలోని అనధికార లేఅవుట్‌లకు ఇది వర్తిస్తుందని, ఈ పథకం ద్వారా నిబంధలనకు అనుగుణంగా చట్టబద్ధమైన భవన నిర్మాణ అనుమతులు, విద్యుత్, నీటిసరఫరా, డ్రెయినేజీ, సీనరేజి కనెక్షన్‌ల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

అభయాంజనేయుడి సేవలో పీఆర్కే

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారిని గన్నవరం పీఆర్కే ఫౌండేషన్ ఛైర్మన్ పారా రామకృష్ణ బుధవారం దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు సీతారామానుజాచార్యులు అర్చనలు జరిపి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అభయాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గత ఆరేళ్లుగా ఏలూరు రోడ్డులో నిర్వహిస్తున్న అయ్యప్పస్వామి భజన పీఠం శిబిరాన్ని సందర్శించారు. అక్కడ ఆయన పూజలు జరిపి స్వాములకు బిక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఏలూరు జిల్లా తెలుగు మహిళా అధికార ప్రతినిధి వడ్డి వాసవి, గన్నవరం బీజేపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, శేషకుమార్ స్థానిక టీడీపీ నాయకులు కొల్లి బుజ్జి, తుమ్మల ఉదయ్ పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆహార పొట్లాలు పంపిణీ

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అధికార యంత్రాంగం నిర్వహించిన సహాయక చర్యలు అభినందనీయమని స్థానిక శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ అన్నారు. తుఫాన్ ప్రభావం కారణంగా ఫుట్‌పాత్‌లు, రైల్వే స్టేషన్, ఫ్లైవోవర్ కింద మురికి వాడల్లో ఆకలితో అలమటిస్తున్న పలువురు నిరుపేదలకు బుధవారం ఆ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ ఆహార పొట్లాలు, తాగునీరు పంపిణీ చేశారు. వీరమాచనేని బుజ్జి, గొట్టాపు వాసుదేవరావు, ముత్యాల సువర్ణరాజు, బొల్లెద్దు భాగ్యరాజు పాల్గొన్నారు.

ఉంగుటూరులో తుఫాను ప్రభావం పాక్షికం

ఉంగుటూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మొంథా తుఫాను పాక్షిక ప్రభావం చూపింది. ప్రభుత్వ అధికార యంత్రాంగం నిరంతరం అందుబాటులో వుండి ఎక్కడా ఎటువంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా ప్రజలను అప్రమత్తం చేసింది. వేంపాడు, నాగవరప్పాడు, నందమూరు, పెదఅవుటపల్లి, ఆత్కూరు, పెదఅవుటపల్లి, కొయ్యగూరపాడు పాఠశాలల్లో ముందస్తుగా ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించారు. స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో వారికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.





బండారుగూడెంలో నీళ్లలో మునిగిన మినుము.. ఆకునూరులో విరిగిపడిన అరటి తోట

ముంచిన మొంథా తుఫాను

- నీట మునిగిన వరి, మినుము
- నేలకొరిగిన వాణిజ్య పంటలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ధాటికి బాపులపాడు మండల వ్యాప్తంగా భారీ పంట నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు వర్షం తోడవడంతో వరిపంట ఎక్కడికక్కడ నేల వాలిపోయింది. మండల వ్యాప్తంగా 17వేల ఎకరాల్లో వరిపంట, 13వేల ఎకరాల్లో మినుము పంట సాగవుతోంది.

● వరితో పాటు మినుము, పెసర తదితర పంటలకు కూడా అపార నష్టం వాటిల్లింది. మెట్ట ప్రాంతాలైన వేలేరు, మల్లవల్లి, రంగన్నగూడెం, బండారుగూడెం తదితర గ్రామాల్లో మినుము పంట నీటిలో పూర్తిగా మునిగిపోయి ఆకులు మాత్రమే కనబడుతున్నాయి.

దెబ్బతిన్న పంటల పరిశీలన

గన్నవరం: మండలంలోని ముస్తాబాద గ్రామంలో మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న వరిపంటలను టీడీపీ బృందం బుధవారం పరిశీలించింది. టీడీపీ మండల అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశా లమేరకు స్థానిక టీడీపీ నాయకులు, రైతులతో కలసి దెబ్బతిన్న వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి రైతుకు అండగా నిలుస్తామని ఎవ్వరు అధైర్య పడొద్దని రైతులకు భరోసా కల్పించారు. దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించిన వారిలో టీడీపీ నాయకులు బోడపాటి రవి, కడియాల రాజశేఖర్, అన్నే హరి కృష్ణ, పాలడుగు రత్నారావు, కొమ్మినేని కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.





ఉప్పలూరులో వరి పంటను పరిశీస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. ముస్తాబాదలో..

చేతికొచ్చిన పంట నేలపాలు

ఉయ్యూరు: వరిపంట చేతికొస్తున్న తరుణంలో మొంథా తుపాను రైతులను నిండాముంచింది. కొన్ని గ్రామాల పరిధిలో వరిపంట పాలు పోసుకునే స్థితిలో ఉండగా మరికొన్ని గ్రామాల పరిధిలో పంట తయారై వారం పదిరోజుల్లో కొత కోస్తామనుకుంటున్న సమయంలో మొంథా తుపాను ప్రభావంతో వీచిన గాలులు, వర్షాలకు నేలవాలి రైతులకు తీవ్రనష్టం కలుగజేసింది.

మొంథా తుపాను ప్రభావంతో వీచిన పెనుగాలులు, వర్షానికి మండల పరిధిలో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. గాలు లకు 7 గృహాలు పడిపోగా, 48 వృక్షాలు కూలిపో యాయని, 30 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని తహసీల్దార్ తెలిపారు. పడిపోయిన స్తంభాలు సరిచేసి విద్యుత్‌శాఖ గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

చంద్రబాబు దూరదృష్టితో తగ్గిన నష్టం: వైవీబీ



ఉయ్యూరు: సీఎం చంద్రబాబు దూరదృష్టితో తీసుకున్న ముందస్తు జాగ్రత్తలతో మొంథా తుపాను నష్టతీవ్రత నివారించగలి గారని టీడీపీరాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం సందర్శించి ఆశ్రయం పొందుతున్నవారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఉన్నవారికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన వ్యాపారవేత్త దండమూడి కిషోర్‌ను అభినందించారు.



గుంటతిప్ప కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రహదారి ముంపును నివారించండి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంతోపాటు, జాతీయ రహదారి కొద్దిపాటి వర్షానికే ముంపబారిన పడుతున్నాయని తక్షణమే వర్షపు నీరు బయటకు పోయేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రసాదంపాడులో తుపాను ముంపునకు గురైన ప్రాంతాలను ఆయన సందర్శించారు. విమానాశ్రయం నుంచి అమరావతికి ప్రధాన రహదారిపై తరుచూ వర్షపునీరు నిలవడం దారుణమనీ సంబంధిత అధికా రులు శ్రద్ధ పెట్టి ఈ రహదారిపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసాదంపాడు గ్రామ ముంపునకు కారణమవుతున్న తిప్పగుంట డ్రెయిన్ పూడికతీసి సక్రమంగా నీటిపారుదల జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి బాబూరావు, నెక్కంటి శ్రీదేవి, సర్నాల బాలాజీ, బొప్పన హరికృష్ణ, కొల్లా ఆనంద్, కోనేరు నాని, పోలిశెట్టి రమణ, గూడపాటి తులసీమోహన్, నభిగాని కొండ, అద్దేపల్లి సాం బు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొంథా విధ్వంసం

● కోడూరులో భారీ వృక్షాలు పడి ఇళ్లు ధ్వంసం ● మచిలీపట్నంలో విరిగిపడిన చెట్లు ● చల్లపల్లిలో నేలవాలిన వరి, కూలిన అరటి పంట ● భారత్ సాల్ట్ పరిశ్రమకు భారీ నష్టం

● పునరావాస కేంద్రాలను సందర్శించిన కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ● బాధితులకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ భరోసా ● కృత్తివెన్నులో ఆక్వా అతలాకుతలం


కోడూరులో ఇంటిపై పడిన భారీ వృక్షం

కోడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు కోడూరులోని పలుప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలి నివాసాలు, కార్లు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరగటంతో విద్యుత్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. వేలాది ఎకరాలలో వరి పంట నేలకొరిగింది. కోడూరు, రామకృష్ణాపురం, నరసింహాపురం, కృష్ణాపురం, విశ్వనాథపల్లి, మందపాకల, స్వతంత్రపురంలో భారీ వృక్షాలు కూలటంతో రాకపోకలకు, విద్యుత్ అంతరాయం ఏర్పడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.


పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్ పునరావాస కేంద్రాల సందర్శన

తీర ప్రాంత గ్రామ ప్రజల సంరక్షణకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బుధవారం కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సందర్శించారు. ఆహారం, తాగునీరు, వైద్య సామగ్రి ఏర్పాట్ల గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో 5 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తీర ప్రాంత గ్రామాలైన రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలి, బసవవానిపాలెం, హంసలదీవి, పాలకాయితిప్ప, చింతకోళ్ల నుంచి 5వేల మంది ప్రజలను పునరావాస కేంద్రాకు తరలించామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి విపత్తు ప్రాణ నష్టం, జంతు నష్టం జరగలేదన్నారు. తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఎంపీడీవో సుధా ప్రవీణ్, ఎంఈవో రామదాసు, ఈవోపీఆర్‌డీ రేవతి, మండల కూటమి నేతలు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య పాల్గొన్నారు.

ఇళ్లకు తరలిన బాధితులు

తుపాను ప్రభావం సమసిపోవటంతో పునరావాస కేంద్రాల్లోని తీర ప్రాంత ప్రజలను వారి ఇళ్లకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో బాధితులను వాహనాల్లో ఎక్కించారు.


రామకృష్ణాపురంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మండలంలోని రామకృష్ణాపురం గ్రామాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రంలోని తుఫాను బాధితులతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. తుఫాను ప్రభావిత వర్షాలు వీడే వరకు శిబిరాల్లోనే ఉండాలని సూచించారు. బాధితులకు అండగా ఉండాలని కూటమి నేతలకు సూచించారు.


చిన్నాపురంలో విరుచుకుపడ్డ చెట్టు

మచిలీపట్నంలో విరిగిపడిన చెట్లు

మచిలీపట్నం టౌన్: మొంథా తుపాను ప్రభావం నగరంలో ఎక్కువగా కనబడింది. నియోజకవర్గంలో ప్రాణ నష్టం, పశునష్టం సంభవించలేదు కానీ పంట నష్టం సంభవించింది. పెనుగాలులకు రోడ్లపక్కన చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్లకు అడ్డంగా ఉన్న చెట్లను హుటాహుటిన తొలగిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోవడం, విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో ఇంకా నగరంలో కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా జరగలేదు. చిలకలపూడి వెళ్లే దారిలో మంగినపూడి, మేకావారిపాలెం, తాళ్లపాలెం, చిన్నాపురం తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. మేజర్ పంచాయతీలైన తాళ్లపాలెం తదితర గ్రామాల్లో ఇంకా విద్యుత్ సరఫరా అందించే పరిస్థితి లేదు.


విరుచుకుపడ్డ చెట్టు, విద్యుత్ స్తంభం

నిలిచిన జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసు పనులు

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెద్ద చెట్లు రెండు కూలగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో కార్యాలయంలో విద్యుత్ సరఫరా లేనందున కార్యాలయం పనిచేయ లేదు. లావాదేవీలు నిలిచిపోయాయి. వెంటనే చెట్లను తొలగించి విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

భారత్ సాల్ట్‌కు తీవ్రనష్టం

మచిలీపట్నం: మొంథా తుపాను కారణంగా మచిలీపట్నం పల్లెతుమ్మలపాలెంలోని భారత్ సాల్ట్ కంపెనీకి తీవ్రనష్టం వాటిల్లింది. 6500 ఎకరాల్లో ఉప్పు సాగుతోంది. తుపాను ప్రభావంతో పెద్దఎత్తున అలలు ఎగిసిపడి ఉప్పు ఉత్పత్తి కేంద్రంలోకి ప్రవేశించటంతో అక్కడ ఉప్పు ఉత్పత్తికోసం నిల్వ ఉంచిన చెరువుల్లోని నీరు, చెరువులకు సంబంధించిన గట్లకు గండ్లు పడిపోయాయి. ఏటా నవంబరులో ఇక్కడ ఉప్పు ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ తరుణంలో తుపాను కారణంగా చెరువులకు గండ్లు పడటంతో తీవ్రనష్టం వాటిల్లింది. భారత్ సాల్ట్ కోన, పల్లెతుమ్మలపాలెం, పోలాటితిప్ప తదితర గ్రామాలకు చెందిన 2వేల మందికి పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది. ఈ ఏడాది ఉప్పు ఉత్పత్తి ప్రారంభించే సమయానికి తుపాను రూపంలో విపత్తు రావటంతో ఉప్పు ఉత్పత్తి ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. భారత్ సాల్ట్ ఫ్యాక్టరీలోని విద్యుత్ స్తంభాలు, పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెం, కోన గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు నేలవాలటంతో తీవ్ర నష్టం వాటిల్లింది.


నదీతీరంలో గాలులకు విరిగిపడిన అరటిచెట్లు

నేలవాలిన వరిచేలు.. విరిగిపడిన అరటిచెట్లు

చల్లపల్లి: తుఫాను గాలుల ధాటికి వరిచేలు నేలవాలాయి. మండలంలో 11వేల 907 ఎకరాల్లో వరిసాగవుతుండగా, పలు గ్రామాల్లో గింజ పాసుపోసుకునే దశలో ఉంది. కొన్నిర గ్రామాల్లో వరిపైరు గింజ తయారై ఉంది. గాలుల తీవ్రతకు వరి గింజలు తయారైన చేలు నేలవాలాయి. మాజేరు పరిధిలోని పల్లపు ప్రాంతంలో సుమారు 190 ఎకరాలు నీటిలోనే ఉన్నాయి. చల్లపల్లి, మంగళాపురం, మాజేరు, మేకావారిపాలెం, వక్కలగడ్డ, రాముడుపాలెం, పాగోలు తదితర గ్రామాల్లో 3618 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈమేరకు గ్రామాల్లో పర్యటించి వరిచేలను పరిశీలించి రైతులకు సూచనలు అందిస్తున్నట్టు ఏవో కే మురళీకృష్ణ తెలిపారు. కృష్ణానదీ తీర గ్రామాల్లో వాణిజ్య పంటలు, ప్రధానంగా అరటితోటలు గాలులకు విరిగిపడ్డాయి. చేతికందే దశలో ఉన్న అరటిచెట్లు విరిగిపడిపోవటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద కారణంగా గతంలో అరటి రైతులు నష్టపోగా, తాజాగా 114 ఎకరాల్లో అరటి తోటలు, రెండెకరాల్లో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్టు అంచనావేసినట్లు ఉద్యానవన శాఖ అధికారాణి జే కీర్తి తెలిపారు.



ఆక్వా అతలాకుతలం

కృత్తివెన్ను: మొంథా తుఫాన్ ప్రభావంతో డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని తీరప్రాంత, లోతట్టు గ్రామాలైన లక్ష్మీపురం, పోడు, నిడమర్రు, దోమలగొంది గ్రామాల్లో డ్రెయిన్లు నీరు లాగకపోవటంతో పొంగి, సమీప చెరువులన్నీ నీట మునిగాయి. దీంతో గట్లు కనబడకుండా నీటిలో చెరువులు మునిగిపోతున్నాయి. చెరువుల్లోని చేపలు, రొయ్యలను కాపాడుకొనేందుకు ఆక్వా రైతులు గట్లపై వలలు కట్టుకొని, తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయిన తమకు నష్టం తప్పదని వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు కొల్లు రవీంద్ర, రవికుమార్

ముందుజాగ్రత్తతోనే విద్యుత్ సరఫరా నిలిపివేత

● తుపాను వల్ల 22 సబ్ స్టేషన్లపై ప్రత్యేక మరమ్మతులు
● 471 11 కేవీ ఫీడర్లకు మరమ్మతులు చేపట్టాం
● రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సౌకర్యం పునరుద్ధరిస్తున్నాం
● విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను వల్ల ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా ఉండాలనే లక్ష్యంతో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేశామని మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం ఉదయం వారు నగరంలో పర్యటించారు. జడ్పీ సెంటర్ సమీపంలోని చిలకలపూడి సర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన తుపాను ప్రభావంతో చెట్లు విరిగి కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫారాన్ని పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తొలుత నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో నగరంలో ఊహించిన దానికంటే పెద్ద మొత్తంలో గాలులు వీయడంతో ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. ఇంకా 25వేల గృహాలకు విద్యుత్‌ను పునరుద్ధరించాల్సి ఉందని, తక్షణ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు పరిధిలో 52 సబ్ స్టేషన్లు ఉండగా, వాటిలో 22 సరిచేశామని, ఇంకో 19 సబ్‌స్టేషన్లకు తక్షణ మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. 471 11 కేవీ ఫీడర్ల లైన్లకు మరమ్మతులు చేపట్టామని, ఇంకా 23కు మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, అమరావతి నుంచి రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ వ్యవస్థ ద్వారా తుపాను ప్రభావిత జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేసిందన్నారు. ఏపీఎస్ఆర్‌టీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ తుపాను కారణంగా రాష్ట్రంలో ఒక్క మరణం సంభవించకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. విద్యుత్ శాఖ డైరెక్టర్ మురళీకృష్ణ, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానంద్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎం బాబాప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని పాల్గొన్నారు.

సీఎం దృష్టికి మత్స్యకారుల సమస్య

3 రోజులుగా సముద్రంలోకి వేటకు వెళ్లకుండా ఆంక్షలు విధించడంతో ఆర్థికంగా నష్టపోయిన మత్స్యకారులను ఆదుకోవాలంటూ మంత్రి కొల్లు రవీంద్రను బుధవారం మత్స్య సహకార సంఘాల నేతలు కోరారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళతానని మంత్రి కొల్లు రవీంద్ర వాగ్దానం చేశారు.

నూజివీడు కోర్టుకు మాజీ ఎమ్మెల్యే వంశీ



నూజివీడు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ బుధవారం ఏలూరు జిల్లా నూజివీడు కోర్టుకు హాజరయ్యారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలంలో నకిలీ నివేశన స్థల పట్టాల పంపిణీ విషయంలో బాపులపాడుకు చెందిన ఓ వ్యక్తి వేసిన ప్రైవేట్ కేసులో కోర్టుకు హాజరు కావాల్సిందిగా ఆదేశాలు రావడంతో వంశీ నూజివీడు సెకండ్ ఏజేఎం కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి సదరు కేసును వచ్చే ఏడాది ఫిబ్రవరి 16కి వాయిదా వేయడంతో న్యాయవాదులతో మాట్లాడిన అనంతరం కోర్టు నుంచి వెళ్లిపోయారు.


ఎప్పుడూ బిజీగా ఉండే బందరు రోడ్ ఖాళీగా..

బోసిపోయిన నగరం

● ప్రధాన కూడళ్లలో తెరవని వ్యాపార సముదాయాలు
● రవాణా సేవలు అంతంతమాత్రం ● ఖాళీగా రోడ్ల దర్శనం

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నగరం మొత్తం స్తబ్దంగా మారింది. గాలులు, వర్షం తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలోని అన్ని వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, షాపింగ్ మాల్స్‌ను మూసేయలంటూ మంగళవారం రాత్రే ఆదేశాలు జారీచేశారు. దీంతో నగరంలోని అన్ని వ్యాపార సముదాయాలను మంగళవారం రాత్రి ఎనిమిది గంటలకే మూసేయడంతో నగరం ఒక్కసారిగా నిశ్శబ్దంలోకి జారుకుంది. నగరంలోని ప్రధాన వాణిజ్య సముదాయ ప్రాంతాలైన బీసెంట్ రోడ్డు, బెంజిసర్కిల్, ఆటోనగర్, వన్‌టౌన్, టూటౌన్, గవర్నర్‌పేట బోసిపోయాయి. తుఫాన్ ప్రభావంతో బలమైన గాలులతో కూడిన వర్షం పడే అవకాశముందని, ప్రజలెవరూ ఇళ్లనుంచి బయటకు రావద్దని అధికారులు ప్రకటించడంతో రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు షాపులు తెరవకపోవడంతో అక్కడక్కడ మినహా వ్యాపార సముదాయాలున్న ప్రాంతాలు జనసంచారం లేకపోవడంతో బోసిపోయాయి. రవాణా సేవలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు పరిమిత స్థాయిలో మాత్రమే నడుస్తుండడంతో నగరంలోని రహదారుల్లో రద్దీ కనిపించలేదు. బుధవారం సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

43వేల ఎకరాల్లో వరిపంట నష్టం

● గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లో ప్రాథమిక అంచనాలు సిద్ధం

గుడివాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు 43వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనాలు వేశారు. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే ఈ నష్టం మరింత పెరిగే అవకాశాలున్నాయి.

గుడివాడ నియోజకవర్గంలో 5,978ఎకరాల్లో నష్టం

వ్యవసాయ ఆధారిత గుడివాడ నియోజకవర్గంలో 5,978 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రాథమిక అంచనాలు సిద్ధం చేశారు. గుడివాడ మండలంలో 1,862 ఎకరాలు, గుడ్లవల్లేరు మండలంలో 2,200 ఎకరాలు, నందివాడ మండలంలో 1,913 ఎకరాల్లో వరిపంట నేలకొరిగినట్లు గుర్తించారు.

పామర్రు నియోజకవర్గంలో 37,177ఎకరాల్లో నష్టం...

పామర్రు నియోజకవర్గంలో నష్టం తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయి. మండలంలో 2,003 ఎకరాల్లో, పెదపారుపూడి మండలంలో 4,700 ఎకరాల్లో, పమిడిముక్కల మండలంలో 16వేల ఎకరాల్లో, మొవ్వ మండలంలో 4,474ఎకరాల్లో, తోట్లవల్లూరు మండలంలో 5 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. తోట్లవల్లూరు మండలంలో 700ఎకరాల్లో అరటి, 100 ఎకరాల్లో మినుము పైరు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.


నేలకొరిగిన వరిపైరు




కూలిన ధ్వజస్థంభం

మొంథా తుఫాను ధాటికి మంగళవారం అర్థరాత్రి పామర్రు మండలం, పసుమర్రు గ్రామంలోని శివాలయ ధ్వజస్థంభం కూలిపోయినట్టు ఆలయ పూజారి హరిబాబు, ఈవో ప్రసాదరావు తెలిపారు.

విజయవాడ రైల్వే డివిజన్ అప్రమత్తం

రైల్వేస్టేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం సమయంలో విజయవాడ రైల్వే డివిజన్ పూర్తి అప్రమత్తతతో పనిచేస్తోంది. ఖచ్చితమైన ప్రణాళిక సమన్వయ ప్రయత్నాలతో, కార్యకలాపాలపై తుపాను ప్రభావం కారణంగా తలెత్తే ఏదైనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి డివిజన్ 24 గంటలూ సిబ్బందిని, యంత్రాలను సమీకరించింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 20806 ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ (న్యూఢిల్లీ - విశాఖపట్నం)ను విజయవాడ స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్ 6 వద్ద సురక్షితంగా నిలిపివేశారు. వాణిజ్య, ఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది మొత్తం 329 మంది ప్రయాణికులను దింపి, జాగ్రత్తగా ప్లాట్‌ఫామ్ నంబర్-1లోని వెయిటింగ్ హాళ్లకు తరలించారు, అక్కడ సీటింగ్ రిఫ్రెష్‌మెంట్ సహా అన్ని అవసరమైన ఏర్పాట్లు అందుబాటులో ఉంచారు. హౌరాకు వెళ్లే రైళ్లలో ప్రయాణికులకు ఒకే టికెట్లపై వసతి కల్పించారు, అదనపు చార్జీలు లేదా అసౌకర్యం లేకుండా వారి తదుపరి ప్రయాణానికి అవకాశం కల్పించారు. స్టేషన్‌లోని అన్ని క్యాటరింగ్ స్టాళ్లు రాత్రంతా తెరిచి ఉన్నాయి, ప్రయాణికులకు నిరంతర సేవ సహాయం అందిస్తున్నాయి. 2800 క్యూబిక్ మీటర్ల ఇసుక, 2500 క్యూబిక్ మీటర్ల బండరాళ్లు, 12స్టీల్ ఎమ రైన్సీ గిడ్డర్లు, 150 హ్యూమ్ పైపులు వంటి అత్యవసర సామగ్రిని కీలకమైన ప్రదేశాల్లో పేర్చబడి సిద్ధంగా ఉంచారు. పగలు, రాత్రి ఆపరేటర్లతో కూడిన 72 ట్రాక్ యంత్రాలు అవసరమైన మానవశక్తి, సాధనాలతో పాటు ఏదైనా ప్రభావిత ప్రదేశానికి త్వరగా తరలించడానికి సిద్ధంగా ఉంచారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ వలంటీర్లు ప్రశంసనీయమైన సమాజ స్ఫూర్తిని ప్రదర్శిస్తూ తుపాను అనంతర పునరుద్ధరణ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ పరిసరాలు, కాలనీలు, కార్యాలయాలు పరిసర ప్రాంతాల నుంచి పడిపోయిన చెట్లు, శిథిలాలను తొలగించడంలో సహాయపడి సాధారణ స్థితిని పునరుద్ధరించారు. డివిజన్ సంసిద్ధత గురించి విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో తమ బృందాలు అద్భుతమైన నిబద్ధతను ప్రదర్శించాయన్నారు. ప్రయాణికుల భద్రత, పారిశుధ్యం సజావుగా కార్యకలాపాలను నిర్వహించడానికి 24 గంటలూ పనిచేస్తున్నాయని, వాణిజ్య, ఆపరేటింగ్, ఇంజనీరింగ్ నుంచి వైద్య, భద్రత వరకు ప్రతి విభాగం ప్రయాణికులను, రైల్వే ఆస్తులను రక్షించడానికి నిస్వార్థంగా పని చేసిందన్నారు. ప్రజా సంబంధాల అధికారి సకాలంలో సమాచారాన్ని వ్యాప్తి చేశారన్నారు.


టార్పాలిన్, దుప్పట్లను పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రెడ్‌క్రాస్ సేవలు

● పలు ప్రాంతాల్లో టార్పాలిన్, దుప్పట్లు పంపిణీ

విజయవాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ నగరంలోని నీటముంపునకు గురైన కుటుంబాలకు బుధవారం ఉదయం పూరిగుడెసెలు, రేకుల షెడ్డులో ఉంటున్న నిరుపేదలకు దుప్పట్లు, టవల్స్, టార్పాలిన్స్ అందించారు. సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జీ సమరం, వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి, సెక్రటరీ చిట్టిబాబు, సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ జీ సమరం మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దేశవ్యాప్తంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విస్తృతమైన సేవలందిస్తుందన్నారు. వైస్ చైర్మన్ వెలగా జోషి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ముంపు ప్రాంతాల్లోని నిరుపేదలకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కేబీఎన్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లపై అసత్యప్రచారం

● అమరావతి రైతులకు రిటర్నబుల్ ప్లాట్‌ల కేటాయింపు ● దాదాపు తుది దశకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
● ఇంకా 2501 మందికి 8441 ప్లాట్‌లు రిజిస్ట్రేషన్ చేయాలి ● ప్రతి రోజు 60 నుంచి 90 ప్లాట్‌లు రిజిస్ట్రేషన్
● రానున్న 4 నెలల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం ● మున్సిపల్ మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులకు ప్లాట్‌ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు. రైతులను, ప్రజలను తప్పుదోవ పటిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు. రాబోయే 4 నెలల్లో రైతులకు కేటాయించాల్సిన ప్లాట్‌లతో పాటు రిజిస్ట్రేషన్లను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, 2014-19 మధ్య కాలంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాట్‌ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురించి లెక్కలతో సహా మంత్రి నారాయణ వివరించారు. భూసమీకరణ కింద ఇప్పటి వరకూ 29644 మంది రైతులకు 34192.19 ఎకరాల్లో ప్లాట్ల కేటాయింపు పూర్తయిందన్నారు. ఇంకా 991 మంది రైతులకు 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు. వీటిలో ఉండవల్లిలో లే అవుట్ ఫైనల్ కాకపోవడం, లంక భూములు, కోర్టు కేసులు, పీవోటీ కేసులు, 12 సెంట్లలోపు ఉన్నభూములు ఉన్నాయన్నారు.

ఇక రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా వేగవంతంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకూ 26732 మంది రైతులకు 60980 ప్లాట్లను రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. ఇంకా 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. వీటిలో కోర్టు కేసులన్నవి 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు, ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందిన 1170 ప్లాట్లు, వివాదాల్లో 450 మందికి చెందిన 1889 ప్లాట్లు, పీవోటీ కేసుల్లో 78 మంది రైతులకు చెందిన 208 మంది పాట్లు, దేవదాయశాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందిన 69 ప్లాట్లు, లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందిన 337 ప్లాట్లు, ఎన్ఆర్ఐలు 210 మందికిచెందిన 444 ప్లాట్లు ఉన్నాయన్నారు. పెండింగ్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం రోజుకు 60 నుంచి 90 ప్లాట్ల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు., ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 231.03 కోట్ల నగదు చెల్లించగా మరో 484 మంది రైతులకు 3.15 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 319 మంది రైతులకు 1.03 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు.



పీ నైనవరంలో చెరువుకు గండి

● పరిశీలించిన అధికారులు

విజయవాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం పీ నైనవరం గ్రామంలోని కుక్కలవాని కుంట చెరువుకు బుధవారం ఉదయం గండి పడింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి ఆరడుగుల మేర గండి పడింది. దీంతో నీరు పంట పొలాల్లోకి వెళ్లడంతో పంట పొలాలు నీటమునిగాయి. ఆర్‌డీవో కావూరి చైతన్య, ఎండీవో విగ్గిన్స్, తహసీల్దార్ సుగుణ చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. గండి కారణంగా ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పూడుస్తామని పంచాయతీ కార్యదర్శి అజేంద్ర తెలిపారు.

ప్రమాదకరంగా బూరుగుల చెరువు

నున్న గ్రామంలోని బూరుగుల చెరువు ప్రమాదకరంగా ఉంది. 3 రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువు పూర్తిగా నిండిపోయి నీరు పైకి ఎగదన్ని కనిపిస్తుంది. గండి పడే అవకాశాలుండటంతో అప్రమత్తమైన అధికారులు నీటిని మళ్లిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. బుధవారం తహసీల్దార్ సుగుణ, ఇరిగేషన్ డీఈ సత్యనారాయణ, ఏఈ రాజశేఖర్, పంచాయితీ కార్యదర్శి సురేష్‌బాబులు చెరువును పరిశీలించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

పవర్‌లిఫ్టింగ్ పోటీలు రేపటి నుంచి

గుడివాడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ మెమోరియల్ పురుషుల, స్త్రీల ఉమ్మడి కృష్ణాజిల్లాల ఓపెన్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ పోటీలను ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్టు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పవర్ లిఫ్టర్లు అందరూ పాల్గొనవచ్చునని కోరారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికేట్లు, మెడల్స్, బహుమతులను ముగింపు సభలో అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు స్టేడియం వెయిట్ లిఫ్టింగ్ కోచ్ 85220 99995కు సంప్రదించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యలవర్తి శ్రీనివాసరావు

మొంథాను అప్రమత్తతతో ఎదుర్కొన్నాం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా


పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పమిడిముక్కల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ అప్రమత్తతతో మొంథా తుపాను గండం వల్ల ప్రాణ నష్టంలేకుండా బయటపడి, ఆస్తి నష్టం తగ్గించుకోగలిగామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని బుధవారం కూటమి నాయకులతో కలసి సందర్శించి ఆశ్రయం పొందుతున్నవారికి ధైర్యం చెప్పారు. వర్షాలు తగ్గేవరకూ పునరావాస కేంద్రంలో ఉండవచ్చని, ఏవిధమైన భయాందోళన చెందనవసరం లేదని పునరావాస కేంద్రంలో ఉన్న ఎస్టీ వర్గాలకు ధైర్యం చెప్పారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి పాల్గొన్నారు.

కూచిపూడి : తుపాను సృష్టించిన బీభత్సానికి


మల్లాయిపాలెంలో ఇంటిపై పడిన వేప చెట్టు

జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ లేకపోవటంతో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. విద్యుత్ సమస్యల కారణంగా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. బుధవారం సాయంత్రానికి కొన్ని గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరించినప్పటికీ కొన్ని గ్రామాల్లో పునరుద్ధరించాల్సి ఉంది. చినముత్తేవిలో ఓ ఇంటి పక్కన ఉన్న భారీ మామిడిచెట్టు ఇంటికి అనుకుని కూలిపోయింది. ఇంటిపై పడకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని గృహస్థులు తెలిపారు. కూచిపూడి, మొవ్వ, పెదపూడి, భట్లపెనుమర్రు, అయ్యంకి, పాలంకిపాడు గ్రామాల్లో ఇలాంటి సంఘటనే చోటు చేసుకున్నాయి.

గుడివాడ రూరల్ : తుఫాన్ కారణంగా పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. ఇళ్లపై వృక్షాలు పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మల్లాయిపాలెం రైల్వే స్టేషన్ వద్ద వేపచెట్టు పడటంతో రెండు గృహాలు దెబ్బతిన్నాయి. బిళ్లపాడు గ్రామంలో ఓ చెట్టు పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. మోటూరు అడ్డ రోడ్డు వద్ద భారీ చెట్లు పడటంతో విద్యుత్ సిబ్బంది, పోలీసులు కలసి చెట్లు తొలగించారు.


గుడివాడలో ఒరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్

పామర్రు : పామర్రుజిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన తుఫాన్ పునరావాస కేంద్రంలో ప్రజలకు ఎలాంటి అసౌర్యాలు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు సంబంధిత అధికారులు తీసుకోవడంతో శిబిరంలో ఉన్న ప్రజలు ఏర్పాట్లపై సంతృప్తిని వ్యక్తంచేశారు. వారిలో చిన్నారులకు అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్తల పర్యవేక్షణలో అవసరమైన పాలు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్నభోజనం అనంతరం బుధవారం సాయంత్రం ప్రత్యేక ఆటోల ద్వారా తరలించారు. ప్రత్యేక అధికారి వెంకట్రావ్, తహసీల్దార్ రవికాంత్, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌సలీం, ఎంపీడీవో జ్యోతి, ఆర్ఐ రాము, ఎస్సై రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

పామర్రు : పామర్రు పరిధిలోని నిమ్మకూరు, నిభానుపూడి, జుజ్జువరం, జమీగోల్వేపల్లిలో మొంథా తుపాను ప్రభావంతో ఈదురుగాలులకు 36 విద్యుత్ స్తంభాలతోపాటు నాలుగు ట్రాన్స్‌పార్మర్లు దెబ్బతిన్నాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ.8.30లక్షల వరకు విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. దెబ్బతిన్న విద్యుత్‌లైన్లకు యుద్ధప్రాతిపాదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరాఫరాను పునరుద్ధరణ చేసినట్లు ఏఈ వి.ప్రదీప్ తెలిపారు.

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో మొంథా తుపాను బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను బుధవారం సాయంత్రం నుంచి ఎత్తివేస్తున్నట్టు తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు. దీంతో మధ్యాహ్నం భోజనాలు చేసిన తరువాత ప్రజలు సొంతిళ్లకు వెళ్ళిపోయారు.


చిరుచింతలలో ప్రజలతో మాట్లాడుతున్న సరళ కుమారి

ఎవరూ అధైర్యపడొద్దు

గుడివాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుపాను ముప్పును దాటామని, ప్రజలు అధైర్యపడవద్దని మండల ప్రత్యేకాధికారి సరళ కుమారి అన్నారు. బుధవారం చిరుచింతల, రామన్నపూడి తదితర గ్రామాల్లో ఆమె పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా పునరావాస కేంద్రాలకు వెళ్లవచ్చని తెలిపారు. ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో విష్ణు ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : మొంథా తుపాను దాటికి నియోజకవర్గంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తుపాను దెబ్బకు మంగళవారం సాయంత్రం 4గంటల నుండి పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముఖ్యంగా గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల ప్రజలు రాత్రంతా జాగారం చేశారు.విద్యుత్ సరఫరాలో అంతరాయానికి తోడు రాత్రంతా దోమల స్వైరవిహారంతో గ్రామీణ ప్రాంత ప్రజలు బెంబెలెత్తిపోయారు.బుధవారం ఉదయం ఎంపిడివో బి.వై విష్ణుప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారుల చొరవతో మళ్ళీ యథాస్థితిలో స్తంభాలను నిలపడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. గత మూడు రోజులుగా పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న బాధితులను కూటమి నాయకులు బుధవారం సందర్శించారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, వెనిగండ్ల రామకృష్ణ జగన్మోహనరావు, సాంబయ్య, త్రినాథ్ పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : గుడివాడలో చాలా వరకు నష్టం తక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు యు.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. తుఫాన్ కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు మళ్లించుకోవాలని తెలిపారు. శాస్త్రవేత్తలు పద్మావతి, నవీన్, రేవతి, ఏడిఏ కవిత, ఏవో అనంతలక్ష్మీ పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం వల్లే ప్రాణ, ఆస్తి నష్టం తప్పిందని మాజీ ఎమ్మెల్యే, వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. సెరివేల్పూరు గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రజలు అధైర్యపడవద్దని తెలిపారు. పేరుపేరున ఆప్యాయంగా పలుకరించటంతో రావికి తమ సమస్యలు విన్నవించారు. అధికారులు దగ్గరుండి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

గుడ్లవల్లేరు : మొంథా తుఫాన్ ప్రభావం వల్ల మంగళవారం రాత్రి వీచిన గాలులకు మండలంలో పలుగ్రామాల్లో చెట్లు విరిగిపడి విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగెలు తెగిపడ్డాయి. డోకిపర్రులో 5 చెట్లు విరిగిపడ్డాయి విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. కూరాడ లాకుదిగువ నుంచి విన్నకోట వరకూ ముదినేపల్లి రహదారిపై 20కి పైగా చెట్లు విరిగి పడ్డాయి. వీటిని ఎంపీడీవో ఇమ్రాన్, గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణల పర్యవేక్షణలో రాత్రికిరాత్రే తొలగించి రహదారులు క్లీయర్‌చేశారు. బుధవారం ఉదయం విద్యుత్ లైన్లు కొత్తవి వేసి బుధవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కాగా మండలంలో పలు గ్రామాల్లో కొన్ని ప్రాంతాల్లో పూరిళ్లపై కప్పులు లేచి పడి ఆస్తినష్టం వాటిల్లింది. పాక్షికంగా 16 ఇళ్లు దెబ్బతినగా, గుడిసెలు మూడు, గాదేపూడి, వెణుతురుమిల్లి గ్రామాల్లో పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లు మూడు ఉన్నాయని తహసీల్దారు లోకరాజు తెలిపారు.

నందివాడ : మొంథా తుపాను ముందస్తు చర్యలలో భాగంగా మండలంలోని ఐదుచోట్ల జనార్ధనపురం, నందివాడ, తమిరిశ, వెన్ననపూడి, రుద్రపాక గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు మండల పరిషత్ అధికారి మల్లేశ్వరి తెలిపారు. జనార్ధనపురం పునరావాస కేంద్రంలో 120 మంది,


ఆవిరిపూడిలో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

నందివాడ 81 మంది, తమిరిశ 20 మంది, వెన్ననపూడి 52 మంది, రుద్రపాక 30 మంది, పునరావాస కేంద్రాల్లో ఉన్నట్లు ఆమె తెలిపారు.

పెదపారుపూడి : మొంథా తుఫాన్ నేపథ్యంలో తహసీల్దార్ శ్రీను నాయక్ అధికారులు, కూటమి నాయకులు కలసి పెదపారుపూడి జడ్పీ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాలను పరిశీలించారు. భోజనం, టిఫిన్ ఏర్పాటు చేశామని తెలిపారు. మాజీ సర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ, కిషోర్, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు రాజబాబు, ఫణి కుమార్, పంచాయతీ కార్యదర్శి సాగర్ రాణి, డీసీహెచ్ శ్రీనివాసరావు, సుందర్‌రావు పాల్గొన్నారు.


పామర్రులో ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్న రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు

పెదపారుపూడి : తుఫాన్ ప్రభావంతో మండలంలోని పెదపారుపూడి, యలమర్రు, వెంట్రప్రగడ, వానపాముల, జమిదింటకుర్రు, అప్పికట్ల, జువ్వనపూడి, మోపర్రు పొలాల్లో వరి పంట గాలికి ఒరిగిపోయింది.ఏవో ఆంజనేయులు మాట్లాడుతూ మండలం మొత్తం 2500 ఎకరాలు ఒరిగిపోయిందని, వరి చేలల్లో నీటిని తొలగించుకోవాలన్నారు.

తోట్లవల్లూరు : మొంథా తుపానుతో ఎక్కడా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టటం వెనుక సీఎం చంద్రబాబునాయుడు సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. తోట్లవల్లూరు, బొడ్డపాడు గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే సందర్శించి తుఫాను బాధితులను పరామర్శించారు. రాష్ట్ర గౌడ కార్పోరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఎంపీడీవో రవికాంత్ పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో నేలకొరిగిన భారీ వృక్షం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా, నన్నపనేని వీరేంద్ర

వీరేంద్ర దాతృత్వం అభినందనీయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

కూచిపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొం దుతున్న 1000 మందికి దుప్పట్లు పంపిణీ చేయ ంటం నన్నపనేని వీరేంద్ర దాతృత్వానికి నిదర్శనమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పెదపూడిలోని పునరావాస కేంద్రంలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వీరేంద్ర అందించిన దుప్పట్లను పంపిణీ చేశారు. పెదపూడి, చినముత్తేవి, నిడుమోలు, మొవ్వ, కాజ, కోసూరు, భట్లపెనుమర్రు కేంద్రాల్లో తలదాచుకుంటున్న 1000 మందికి దుప్పట్లు అందజేశారు. కూచిపూడి శివారులో వృక్షం కూలి రెండు గృహాలు దెబ్బతినగా బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం వీరేంద్ర అందజేశారు.

పీ4 స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు : నన్నపనేని

సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 కార్యక్రమ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర పేర్కొన్నారు. ఇటీవల 10 లక్షల రూపాయల వ్యయంతో అయ్యంకి నుంచి పెడసనగల్లు వరకు సొంత నిధులు వెచ్చించి రహదారి మరమ్మతులు చేపట్టినట్టు వీరేంద్ర తెలిపారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వర రావు, మొవ్వ ఏఎంసీ చైర్మన్ శివరామయ్య, తులసీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

గుడివాడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగవరప్పాడు జీపీకే రహదారి మలుపు వద్ద అతివేగంగా వస్తున్న ద్విచక్రవాహనం మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మంగళవారం గుడివాడలో పని ముగించుకుని వెళుతున్న అద్దేపల్లి భూపేష్, యర్రా సాత్విక్‌ల ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న ఏపీ40 డీవీ 8414 ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టింది, గాయాలపాలైన భూపేష్, సాత్విక్‌లను చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఏఎస్సై నరసింహారావు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

గుడివాడ రూరల్: రూరల్ మండలంలోని బొమ్ములూరు గ్రామంలో మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ 150 కుటుంబాలకు దుప్పట్లు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచనల ప్రకారం పేదలకుసాయమందించామని తెలిపారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సహాయ చర్యలను వేగవంతం చేయాలి

● రావి వెంకటేశ్వరరావు

గుడ్లవల్లేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు సూచించారు. గుడ్లవల్లేరు మండలంలో పలుగ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. తొలుత మండల పరిషత్ కార్యలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. మండలంలో తుఫాన్ వల్ల ఏర్పడిన నష్టాలను ఆయన అడిగి తెలుసుకొన్నారు. పంట, ఆస్తి నష్టాలను ఆయన తెలుసుకొన్నారు.విద్యుత్ శాఖ విద్యుత్ నష్టాలను త్వతిరిత గతిన పునరుద్ధరించాలని సూచించారు. అనంతరం వడ్లమన్నాడు గ్రామంలో వడ్లమన్నాడు మేజర్ డ్రెయిన్ పొంగడాన్ని ఆయన పరిశీలించారు. వడ్లమన్నాడు వంతెన దిగువ ఎక్కువగా పట్టిన కర్రనాచు, కక్కిసర వల్ల దిగువకు నీరు వేగంగా వెళ్లక మురుక్కాలవ పొంగి, చుట్టుపక్కల చేలు ముంపునకు గురయ్యాయని వారు రావి వెంకటేశ్వరరావుకు తెలిపారు. ఆయన వెంటనే డ్రెయినేజీ


వడ్లమన్నాడులో రైతులతో మాట్లాడుతున్న రావి

శాఖ వారికి ఫోన్‌చేసి ఇక్కడి పరిస్థితిని వివరించి వెంటనే పంటుపెట్టి మిషన్‌తో కర్రనాచును తొలగించాలని ఆయన సూచించారు. అవసరమైతే కలెక్టరుతో మాట్లాడతానని ఆయన రైతులకు హామీఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, డీసీ కౌతవరం చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, కొడాలి రామరాజు, సత్తిబాబు, రమేష్, అట్లూరి స్వరూప్, జగన్మోహనరావు, వెనిగళ్ల రామకృష్ణ, కొండాలమ్మ తల్లి దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్, గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్ యెనిగళ్ల నాగేశ్వరరావు,పోలవరపు వెంకటరావు,వడ్లమన్నాడు పీఏసీఎస్ చైర్మన్ అడపా బాబ్జి , ఉపసర్పంచ్ గరికపాటి రాంబాబు పాల్గొన్నారు.

నష్టపోయిన వరి పంటలను నమోదు చేస్తాం

● అసిస్టెంట్ కలెక్టర్ పరిహన్ జాహిద్

గుడివాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నష్టపోయిన వరి పొలాలన్నింటిని నమోదు చేయటం జరుగుతుందని అసిస్టెంట్ కలెక్టర్ పరిహన్ జాహిద్ అన్నారు. లింగవరంలోని మెరకగూడెంలో ఆయన పర్యటించి రైతులను వివరాలు అడిగి తెలుసుకుని పొలంలోని పంటను పరిశీలించారు. పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో పూర్తిగా నష్ట పరిహారం రావాలని వ్యవసాయాధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారులు, ఏడిఏ కవిత, ఏవో బోలెం అనంతలక్ష్మీ పాల్గొన్నారు.

పెదపారుపూడి : మొంథా తుపాను కారణంగా జరిగిన నష్టం వివరాలను పరిశీలించేందుకు జిల్లా సహాయ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ పెదపారుపూడి మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలోని వరి పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంట్రప్రగడ పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి వెంకట సుబ్బారావు, సహాయ కలెక్టర్‌ను కలసి తుఫాను కారణంగా వరి పైర్లు నేలకొరగటంతో రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, కావున పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీను నాయక్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వీఆర్వో ఫణి కుమార్, పంచాయతీ కార్యదర్శి సాగర రాణి, నందివాడ ఏఈవో సీతారామయ్య, వీపీఏ బిందు, పాల్గొన్నారు.


మెరకగూడెంలో రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ పరిహన్ జాహిద్


చెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

గుడివాడను పూర్వస్థితికి తెస్తాం

● మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్

గుడివాడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను ప్రభావంతో పట్టణంలోని అనేక ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్ అంతరాయం, రోడ్లపై వర్షపు నిల్వలు, డ్రెయినేజీ మూసుకుపోవడం వంటి ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణం సాధారణ స్థితికి వచ్చే వరకు పునరుద్ధరణ పనులను కొనసాగిస్తామని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. బుధవారం వార్డులో ఆయన పర్యటించారు. రహదారులపై నీటి నిల్వలు తొలగించి, డ్రెయినేజీలను శుభ్రపరచి పారిశుధ్య పనులను వేగంగా కొనసాగిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

సత్యదేవుని ఆలయ శిఖర పునఃప్రతిష్ఠకు విరాళాలు

గుడ్లవల్లేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :గుడ్లవల్లేరు గ్రామంలో అత్యంత సుందరంగా గంగానమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం, రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ శిఖర పునఃనిర్మాణం, ఆలయ ఆధునీకరణ పనులు ముగించుకొని ప్రారంభోత్సవాలకు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. గ్రామంలో పలువురు ప్రముఖులు తమ విరాళాలను నిర్వాహక మిటీ సభ్యులు వెంకటరావుకు అందజేశారు.

అన్నదాతకు అపార నష్టం


తోట్లవల్లూరులో వెన్ను విరిగిన అరటి తోట

తోట్లవల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలంలో మొంథా తుపాను అన్నదాతలను తీవ్రంగా దెబ్బతీసింది. మంగళవారం రాత్రి తుపాను ప్రభావంతో వీచిన బలమైన గాల్పులకు, వర్షానికి వరిచేలు, అరటి తోటలకు భారీగా నష్టం వాటిల్లింది. మండల వ్యవసాయాధికారిణి జి శ్రీదేవి, ఉద్యానాధికారిణి మానస బుధవారం పలు గ్రామా ల్లో పర్యటించి ప్రాథమికంగా పంటల నష్టాన్ని అంచనా వేశారు. 5వేల ఎకరాల్లో వరి చేలు నేల మట్టమయ్యాయని ఏవో శ్రీదేవి తెలిపారు. 700 ఎకరాల్లో అరటి తోటలు నెలకొరిగాయని తెలిపారు.

కూచిపూడి: మొంథా తుపాను అన్నదాతకు అపార నష్టాన్ని మిగిల్చింది. గింజ గట్టిపడే దశల్లో ఉన్న వరి చేలు బలమైన గాలులకు నేలకొరిగాయి. మండల పరిధిలో 4447 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ శ్యామల, ఏవో సురేష్‌బాబు నాయక్ పంట నష్టం అంచనాలు రూపొందించారు. కూచిపూడి, బార్లపూడి, మొవ్వ, పెదపూడి, చినముత్తేవి, ఆవిరిపూడి, కాజ, కోసూరు గ్రామాల్లో వరి పైరు నేలవాలింది.

పామర్రు : మంగళవారం అర్ధరాత్రివరకు కురుస్తున్న వర్షాలకు అన్నదాతల పంటలు చాలవరకు నెలకొరగడంతోపాటు కొన్ని పల్లపు ప్రాంతాల్లోని వరి చేలల్లో నీటిలో మునిగాయి. మండల వ్యాప్తంగా 2003 హెక్టార్లో వరిపైరు నెలకొరినట్లు గ్రామాల్లో పర్యటించిన వ్యవసాధికారులు నిర్ధారించారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలో తుఫాను దాటికి వేల ఎకరాల్లో వరిపంట దెబ్బ


పామర్రులో వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు


కూచిపూడిలో అధికారులకు పంట నష్టం వివరిస్తున్న రైతులు

తింది. బుధవారం తీసిన అంచనా ప్రకారం మండలంలో దాదాపుగా 2200 ఎకరాలకు పైగా చేలు నేల కొరిగాయని ప్రాథమిక అంచనాగా మండల వ్యవసాయాధికారి సునీల్ తెలిపారు. కౌతవరం, చినగొన్నూరు, వేమవరం, వడ్లమన్నాడు, మామిడికోళ్ల, లంకాదొడ్డి, గుడ్లవల్లేరులో వరి చేలు నేలకొరిగాయి.

పమిడిముక్కల: మొంథా తుపాను ప్రభావంతో మండల పరిధిలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి పంట నేల వాలిందని ప్రాథమిక అంచన కాగా పూర్తి స్థాయిలో ఏమేర ఉంటుందన్నది రెండురోజుల్లో తెలుస్తుందని మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి తెలిపారు. ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్త సుధారాణి, జ్యోతి రమణి, ఏడీఏ శ్రీనివాస్ పరిశీలించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

నగరంలో మరో 15 పోలింగ్ కేంద్రాలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల పెరుగుదల దృష్ట్యా నగరంలోని 50 డివిజన్లలో ప్రస్తుతం ఉన్న 205 పోలింగ్ కేంద్రాలకు అదనంగా మరో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నగరంలో మొత్తం 220 పోలింగ్ కేంద్రాలకు పెరిగాయి. చిలకలపూడి సెయింట్ ఫ్రాన్సిస్‌లో అదనంగా 2, చిలకలపూడి పాండురంగా మునిసిపల్ హైస్కూల్‌లో 2, హైనీ హైస్కూల్‌లో 2, వలందపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో 1, మాచవరం ఎలిమెంటరీ పాఠశాలలో 1, రైలుపేట హైస్కూల్‌లో 1, మలకాపట్నం ఎలిమెంటరీ పాఠశాలలో 2, జైహింద్ హైస్కూల్‌లో 2, హిందూ కళాశాలలో అదనంగా 1, సర్కిల్‌పేట మునిసిపల్ స్కూల్‌లో అదనంగా మరొకటి పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం పోలింగ్ స్టేషన్ల తుది జాబితాలను మునిసిపల్ కమిషనర్ బాపిరాజు ప్రకటించారు.



మోపిదేవిలంక వద్ద నేలకొరిగిన అరటి తోటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అధైర్యపడకండి..ప్రభుత్వం ఆదుకుంటుంది

● రైతులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ భరోసా

మోపిదేవి/నాగాయలంక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావం తగ్గిన వెంటనే దెబ్బతిన్న పంటల అంచనాలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రైతులు అధైర్యపడొద్దని.. ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. బుధవారం మండలంలో ఆయన పర్యటించారు. వాణిజ్య పంటలైన అరటి, పసుపు, కంద, కూరగాయల పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. నాగాయలంక పడవల రేవులో తుఫానుకు దెబ్బతిన్న పడవలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు.

లోతట్టు ప్రాంతాల్లో నీటిని మోటార్లతో తోడించండి



నగరంలో పర్యటిస్తున్న ప్రత్యేక అధికారి ఆమ్రపాలి, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల ముంపునకు గురయిన లోతట్టు ప్రాంతాల్లోని నీటిని మోటార్లతో సత్వరం తొలగించాలని, డ్రెయిన్ల పూడికతీతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తుఫాన్ స్పెషలాఫీసర్ ఆమ్రపాలి ఆదేశించారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ బాపిరాజుతో కలిసి ఆమె నగరంలో విస్తృతంగా పర్యటించారు. సుందరయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ముంపునకు గురయిన రోడ్లలో మోటార్లతో నీటిని తోడించే ప్రక్రియను పరిశీలించారు. నేలకొరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను పాతే ప్రక్రియ వేగవంతం చేయాలని, నియోజకవర్గంలో అన్ని గ్రామాలు, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కనపర్తి పర్యటన



నాగాయలంకలో దెబ్బతిన్న పడవలను పరిశీలిస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

అవనిగడ్డ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు బుధవారం నాగాయలంక, కోడూరులోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. పలు చోట్ల పడవలు దెబ్బతిన్నాయని, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదని మత్స్యకారులు కనపర్తి దృష్టికి తీసుకురాగా, వెంటనే అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా విద్యుత్‌సరఫరా పునరుద్ధరించాలని ఆయన సూచించారు. నాగాయలంక మండలంలో తుఫాన్ గాలులకు ఢీకొని దెబ్బతిన్న పడవలను కనపర్తి శ్రీనివాసరావు పరిశీలించారు.



మోపిదేవిలంక వద్ద నేలకొరిగిన కంద తోట



సాతులూరులో నేలకొరిగిన వరి



ఎదురుమొండిలో నీట మునిగిన వరి



కానూరులో నేలకొరిగిన వరి



మంగళాపురంలో విరిగిన ఇంటి సిమెంటు రేకులు

మొంథా బీభత్సం

నేలవాలిన భారీ వృక్షాలు..విద్యుత్ స్తంభాలు..వరిచేలు..అరటిచెట్లు

మొంథా తుఫాను అవనిగడ్డ, బందరు, పెడన మండలాల్లో బీభత్సం సృష్టించింది. మంగళవారం సాయంత్రం నుంచీ బుధవారం తెల్లవారుజాము వర కూ భారీ ఈదురుగాలులు వీయటంతో వరి పొలాలు, విద్యుత్ స్తంభాలు, అరటి తోటలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి.



అవనిగడ్డ డిపోలో నిలిచిన బస్సులు



అవనిగడ్డలో గాలికి పడిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ



కూరగాయలు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ



ఇంతేరులో కోతకు గురవుతున్న రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెంలో ఇంటిపై పడిన చెట్టు



గూడూరులో విద్యుత్ తీగలపై పడిన చెట్టు

చల్లపల్లి/మోపిదేవి/నాగాయలంక/ఘంటసాల/బంటుమిల్లి/పెడన/పెడన రూరల్/గూడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలో బందరు రోడ్డు, నడకుదురు రోడ్డు, బైపాస్ రోడ్డు, పాగోలు రోడ్డుతోపాటు వక్కలగడ్డ గ్రామాల్లోనూ, కరకట్టపై అడుగడుగునా చెట్లు విరిగిపడ్డాయి. నిమ్మలతోటలో చెట్లు విరిగి విద్యుత్‌వైర్లపై పడ్డాయి. రామానగరంలో పలు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మంగళాపురంలో గాలుల ధాటికి రేకుల షెడ్డు ఇల్లు ధ్వంసమైంది. మండలంలో 11వేల 907 ఎకరాల్లో వరిసాగు జరుగుతుండగా, మాజేరు పరిధిలోని పల్లపు ప్రాంతంలో 190 ఎకరాలు నీటిలో ఉన్నాయి. చల్లపల్లి, మంగళాపురం, మాజేరు, మేకావారిపాలెం, వక్కలగడ్డ, రాముడుపాలెం, పాగోలు తదితర గ్రామాల్లో 3618 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. చల్లపల్లి మండలంలో 114 ఎకరాల్లో అరటి తోటలు, రెండెకరాల్లో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనావేసినట్లు ఉద్యానవన శాఖ అధికారాణి జె.కీర్తి తెలిపారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో 90 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు కిందపడిపోయాయి. విద్యుత్‌వైర్లు, కండక్టర్లు తెగిపోయాయి. విద్యుత్‌శాఖ చల్లపల్లి డీఈ పులి శివనాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏఈలు పాండురంగారావు, రవికుమార్, సబ్‌ఇంజనీర్ సుధీర్‌లతో పాటు ఎల్‌ఐలు, లైన్‌మెన్‌లు మొత్తం 45 మంది సిబ్బంది మరో 60 మంది కూలీల సహాయంతో బుధవారం మధ్యాహ్నానికి సరఫరాను పునరుద్ధరించారు.

మోపిదేవి మండలంలో..

వెంకటాపురం, పెదప్రోలు, శివరామపురం, కొక్కిలిగడ్డ, మోపిదేవి గ్రామాల్లో వరి పంటలు నేలకొరిగాయి. వాణిజ్య, కూరగాయ పంటలు సాగుచేసిన లంక గ్రామాలైన మోపిదేవిలంక, నాగాయితిప్ప, ఉత్తరచిరువోలులంక, కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక గ్రామాల్లో అరటి, బొప్పాయి నేలకొరగగా, కంద, పసుపు, కూరగాయల తోటల్లో నీరు నిలిచి దెబ్బతిన్నాయి. మోపిదేవి నుంచి వెంకటాపురం, వెంకటాపురం నుంచి పెదకళ్లేపల్లి, మోపిదేవి వార్పు నుంచి విజయవాడ వెళ్లే కృష్ణా నది కరకట్ట భారీ వృక్షాలు సైతం ఈదురుగాలులకు నేలకు ఒరిగాయి. బుధవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

నాగాయలంక మండలంలో..

నాగాయలంక బస్టాండు రోడ్డులో, తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో పెదపాలెం ప్రధాన రహదారిలో చెట్లు విరిగిపోయాయి. విద్యుత్ సిబ్బందితో సీఐ యువకుమార్, ఎస్‌ఐ రాజేష్ వాటిని తొలగించారు. బస్టాండ్ ప్రాంగణం నీటితో నిండిపోయింది. మండలి వెంకట్రామ్ సొర్లగొంది గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలోని తుఫాన్ బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఆహారం, తాగునీరు, వైద్యం ఏర్పాట్లు పరిశీలించారు.

ఘంటసాల మండలంలో..

కొడాలి - మొవ్వ గ్రామాల మధ్య రహదారిలో భారీ వృక్షాలు నేలకొరగటంతో ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి వాటిని తొలగించి రాకపోకలను సుగమం చేశారు. శ్రీకాకుళం - కొడాలి రహదారిలో రెండు చోట్ల భారీ వృక్షాలు నేలకొరగటంతో పంచాయతీ కార్యదర్శి నాగమణి, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ పంచాయతీ, విద్యుత్ శాఖ సిబ్బంది సహాయంతో వాటిని తొలగించారు. పూషడం, మల్లాయిచిట్టూరు తదితర గ్రామాల్లో నేలకొరిగిన చెట్లను తొలగించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సరఫరా వచ్చింది.

బంటుమిల్లి మండలంలో..

వరి పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. అర్తమూరు సాతులూరు రోడ్డులో విద్యుత్ స్తంభం విరిగిపడిపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. మలపరాజుగూడెం, జయపురం, బంటుమిల్లి కోర్టు, మల్లేశ్వరం మార్కెట్‌యార్డు ప్రాంతాలలో భారీ వృక్షాలు నేలకొరిగాయి.

పెడన మండలంలో..

వరి పొలాలు నేలకొరిగాయి. మడక, నందమూరు, బల్లిపర్రు, శింగరాయపాలెం గ్రామాల్లో ఏవో ఎస్.జెస్సీ పర్యటించారు. నీట మునిగిన పంటపై ఉప్పు ద్రావణంతోపాటు రసాయనాలు జల్లాలని సూచించారు. పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి అవసరమైన సౌకర్యాలు అందిస్తున్నామని ఎండీవో అరుణకుమారి, తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు.

గూడూరు మండలంలో..

విపరీతమైన గాలులు వీయడంతో చాలా చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. కొన్ని చోట్ల విద్యుత్ తీగలపై వృక్షాలు పడి విద్యుత్ తీగలు తెగిపోయాయి. విద్యుత్ శాఖాధికారులు బుధవారం సాయంత్రం వరకు మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట పొలాలు గాలి వానకు నేలకొరిగాయి.

పెడనలో..

పట్టణంలో మంగళవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పెనుగాలులు వీచాయి. పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్ పట్టణంలో పర్యటించి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కూరగాయల పంపిణీ

మచిలీపట్నం టౌన్: అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగ ఛాయాదేవితో కలిసి కూరగాయలు, నిత్యావసర వస్తువులు, కొవ్వొత్తులు పంపిణీ చేశారు. నగరంలోని 5వ డివిజన్‌తో పాటు వివిధ గ్రామాల్లో కూరగాయలు పంపిణీ చేశారు. బయటకు రాలేని ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి కూరగాయలు, నిత్యావసర వస్తువులు, కొవ్వొత్తులు పంపిణీ చేశారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్: నియోజకవర్గంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా 36 గంటల తర్వాత కూడా పునరుద్ధరణకు నోచుకోలేదు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై మంగళవారం రాత్రి చెట్లు కూలిపోయాయి. బుధవారం ఉదయం నుంచి పలు చోట్ల మరమ్మతులు చేపట్టారు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించినా, నాగాయలంక, కోడూరు మండలాల్లో విద్యుత్ సరఫరా పునరుద్దరణకు నోచుకోలేదు. అవనిగడ్డ 2వ వార్డు, 8వ వార్డు, లంకమ్మమాన్యం, రాజశేఖరపురం, బందలాయిచెరువు తదితర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. అవనిగడ్డ ఫీడర్‌పై చెట్లు కూలిపోవటంతో బుధవారం అర్ధరాత్రి దాటే వరకు పునరుద్ధరణ జరగకపోవచ్చని అధికారులు తెలుపుతున్నారు. నాగాయలంక, కోడూరు మండలాలకు వెళ్లే విద్యుత్ లైన్లు దెబ్బతినటంతో కౌంటులో ఉన్న రొయ్యలకు ఆక్సిజన్ సమస్య తలెత్తి పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. నాగాయలంక మండల పరిధిలోని గుల్లలమోద, ఏటిమొగ, పెదపాలెం, టి.కొత్తపాలెం ప్రాంతాల్లో, కోడూరు మండలం మాచవరం, ఇరాలి, ఉల్లిపాలెం గ్రామాల్లో రొయ్యల సాగు పెద్ద ఎత్తున జరుగుతుండగా, విద్యుత్ సరఫరా జరగకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అవనిగడ్డలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్‌తో కలసి పరిశీలించారు. అవనిగడ్డ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంతంలో కూలిపోయిన పూరిళ్లను ఆయన పరిశీలించారు. తుఫాన్ కారణంగా రహదారులపై చెట్లు పడిపోవటం, ఆర్టీసీ సిబ్బంది వినియోగించే టిమ్‌లకు చార్జింగ్ లేకపోవటంతో అవనిగడ్డ డిపో సర్వీసులు బయటకు కదలని పరిస్థితి నెలకొంది. బుధవారం ఉదయం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలని బయలుదేరిన ప్రజలకు ఆర్టీసీ సర్వీసులు లేకపోవటంతో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడి వారు రాకపోకలు సాగించారు. బుధవారం సాయంత్రం నుంచి బస్సు సర్వీసులు పునరుద్దరిస్తున్నట్లు డిపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు. గుడివాక వారిపాలెం వద్ద రోడ్డుపై కూలిన వృక్షాన్ని ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొలగించారు. అవనిగడ్డ శివారు బొప్పనవారి చావిళ్ల వద్ద నేలకొరిగని వృక్షాన్ని ఎస్‌ఐ ఆధ్వర్యంలో తొలగించారు. మోదుమూడిలో సర్పంచ్ బచ్చు బేబీ ఆధ్వర్యంలో ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు నిర్వహించారు.

తీరప్రాంత గ్రామాల్లో ఎమ్మెల్యే కాగిత పర్యటన

కృత్తివెన్ను: తీరప్రాంత గ్రామాల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పర్యటించారు. ఇంతేరు గ్రామంలో కోతకు గురవుతున్న ఆర్అండ్‌బీ రోడ్డును పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలతో మాట్లాడారు. తుఫాను ప్రభావంతో మండలంలో విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగి, నేలకొరిగాయి. మండలమంతా అంధకారం అలుముకుంది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది రెండు రోజులు తీవ్రంగా శ్రమించారు. యంత్రాలు, వాహనాల సాయంతో అవకాశం ఉన్నంత మేర పనులు యుద్ధప్రాతిపదికన చేసి, కొన్ని గ్రామాలకు విద్యుత్‌ను అందించారు. మిగిలిన గ్రామాలకు గురువారం సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ సీహెచ్ లక్ష్మీ రాజేష్ తెలిపారు. తుఫాను ప్రభావంతో వరి, ఆక్వా పంటకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కొమాళ్లపూడి, నీలిపూడి, మునిపెడ, సీతనపల్లి, చెరుకుమిల్లి, చినపాండ్రాక, యండపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు కోరారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు అజయ్ గోష్, సిఐటియు నాయకులు మాజేటి శ్రీనివాసరావు తదితరులున్నారు.

పాముకాటు బాధితురాలికి పరామర్శ

చల్లపల్లి: వక్కలగడ్డ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో పాముకాటుకు గురై చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న లక్ష్మీ తిరుపతమ్మను సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ వరదా హరిగోపాల్‌లు పరామర్శించారు. పునరావాసకేంద్రంలో ఉన్న మహిళ తన కుమార్తెను వాష్‌రూమ్‌కు తీసుకువెళుతుండగా, ఆకులకింద ఉన్న పాము కాటువేసింది. బాధితురాలిని చల్లపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యచికిత్సలు అందించారు. మహిళ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని వైద్యులు నేతలకు తెలిపారు.

అజెండాపై చర్చ లేకుండానే ముగిసిన కౌన్సిల్ సమావేశం

పెడన, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అజెండాపై చర్చ లేకుండానే బుధవారం పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ముగిసింది. అజెండాలోని 8 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభం కాకముందే జనసేన 12వ వార్డు కౌన్సిలర్ మట్టా శివపావని లేచి తుఫాను సమయంలో సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యలు పర్యవేక్షించే సమయంలో సమావేశం ఏర్పాటు సమంజసం కాదని ఆమె వాదించారు. దీనిపై ఆమె కమిషనర్‌ను ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం నెలకొకసారి సమావేశం నిర్వహించాల్సి ఉన్నందున ఏర్పాటు చేశామని కమిషనర్ బదులిచ్చారు. తుఫాను వల్ల సమస్యలు తలెత్తకుండా తాము అప్రమత్తంగా వ్యవహరించామన్నారు. తమ సిబ్బందితో మంగళవారం రాత్రంతా పట్టణంలో పర్యటించి సహాయక చర్యలు చేపట్టామని కమిషనర్ చెప్పారు. పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపట్టలేదంటూ శివపావని చేసిన ఆరోపణలను సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ నాగకుమారితో పాటు కౌన్సిలర్లు కటకం ప్రసాద్, చంద్రబాబు ఖండించారు. శివపావని మాట్లాడుతుండగానే అజెండాలోని అన్ని అంశాలను ఆమోదిస్తున్నామంటూ వైసీపీ కౌన్సిలర్లు లేచి బయటకు వెళ్లిపోయారు. మేనేజర్ మట్టా రాజా, ఇన్‌చార్జి టీపీవో బండి కిరణ్, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.